ఆనందం వెల్లివిరిసె

రాజమహేంద్రవరం శివారు గైట్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ తరగతులు అట్టహాసంగా ముగిశాయి. దేశంలో మొత్తం 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి ప్రత్యేకంగా ఎంపిక చేసిన 300 మంది సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్లు 12 రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులల్లో ప్రతిభ చూపారని ఎన్‌సీసీ 18 ఆంధ్ర బెటాలియన్ కాకినాడ గ్రూపు కమాండర్ ఆర్.ఎం. అగర్వాల్ చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు తమ సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ముగింపువేడుకలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

- న్యూస్‌టుడే, రాజానగరం



క్యాడెట్ల సాంస్కృతిక ప్రదర్శన

నేడు హైదరాబాద్‌కు ఆరు ప్రత్యేక బస్సులు

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం): ప్రయాణికుల రద్దీ సోమవారం కూడా కొనసాగనున్నందున రాజమహేంద్రరం నుంచి 4, కొవ్వూరు నుంచి ఒకటి, గోకవరం నుంచి ఒకటి చొప్పున హైదరాబాద్‌కు మొత్తం ఆరు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. విశాఖపట్నంతో పాటు మిగతా దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఆయా రూట్లలో తిరిగే లోకల్ సర్వీసులు కూడా తిరుగు ప్రయాణికులతో రద్దీ నడుస్తున్నాయి.

లెక్క తేలింది.. కిక్కు ఎవరికో!

- లాటరీ విధానంలో లైసెన్సుల మంజూరు నేడు
- ఉమ్మడి జిల్లాలో దరఖాస్తు రుసుము ద్వారా ప్రభుత్వానికి రూ.236.06 కోట్ల ఆదాయం


ఆనం కళాకేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, దానవాయిపేట(రాజమహేంద్రవరం)

ఉమ్మడి జిల్లాలోని మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రభుత్వం నోటిపై చేసిన మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో సోమవారం కేటాయిస్తారు. ఉమ్మడి జిల్లా అబ్కారీ డీసీ వై.చైతన్యమురళీ పర్యవేక్షణలో యంత్రాంగం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తిచేసింది. లాటరీకి కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయాలతో పాటు.. తూర్పుగోదావరి జిల్లాలో ఆనం కళాకేంద్రంలో ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షణలో జేసీలు, డీఆర్వోలు, ఆర్డీవోలతో పాటు.. అబ్కారీ యంత్రాంగం ప్రక్రియ పూర్తి చేయనున్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోగా మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ కొలిక్కిరావచ్చని భావిస్తున్నారు. లాటరీ ప్రక్రియ పూర్తయ్యాక.. ఈనెల 15న ప్రైవేటు మద్యం దుకాణాలు అప్పగిస్తారు. 16 నుంచి కొత్త మద్యం విధానం అమల్లో భాగంగా వ్యాపారాలు కొనసాగనున్నాయి.

మద్యం దుకాణాలు-దరఖాస్తులు ఎన్నంటే..?

జిల్లా	నోటిపై చేసిన దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు	దరఖాస్తు ఆదాయం (రూ.కోట్లలో..)
కాకినాడ	155	3,332	66.64
అంబేడ్కర్ కోనసీమ	133	4,087	81.74
తూర్పుగోదావరి	125	4,384	87.68

లక్ష్యం అలా.. స్పందన ఇలా..

దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించిన ప్రభుత్వం ఒక దుకాణానికి కనీసం 30 దరఖాస్తులు వస్తాయని భావించి.. 1:30గా లక్ష్యాన్ని నిర్దేశించింది. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిశాక పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో ఒక్కో దుకాణానికి సగటున 28.57 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల రూపంలో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వానికి నాన్ రిఫండబుల్ రూపంలో రూ.236.06 కోట్ల ఆదాయం సమకూరింది. ■ తూర్పుగోదావరి జిల్లాలో సగటున ఒక్కో దుకాణానికి అత్యధికంగా 35.07 దరఖాస్తులు వస్తే.. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సగటున ఒక్కో దుకాణానికి 30.72 దరఖాస్తులు, కాకినాడ జిల్లాలో 21.43 దరఖాస్తులు రావడం గమనార్హం.

అన్ని ఏర్పాట్లు చేశాం..

దుకాణాల లాటరీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. లాటరీ కేంద్రం వద్ద సమస్యలు తలెత్తకుండా పోలీసు బందోబస్తుతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశాం. 125 దుకాణాలకు గాను మొత్తం 4384 దరఖాస్తుదారులు లాటరీ ద్వారా లైసెన్సులను సొంతం చేసుకోనున్నారు.

- సీహెచ్ లావణ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్

కనులనిండుగా దసరా..


దేవరపల్లి: రూ.55 వేలతో అలంకరించిన విజయదుర్గాంబిక ప్రత్యేక వాహనం


ఆయుధపూజలో ఎస్పీ నరసింహకిషోర్



విజయదశమి సందర్భంగా జిల్లాలో ఉత్సవాలు అంబరాన్ని తాకాయి. పోలీసు ఏఆర్ కార్యాలయంలో ఆయుధ పూజను ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని శ్రీ సాయి కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, దేవీచౌక్‌లో అమ్మవారిని జిల్లా కలెక్టర్ ప్రశాంతిలు దర్శించుకున్నారు. పలుచోట్ల ఉత్సవాలు పూర్తికావడంతో ప్రతిమలను గోదావరిలో నిమజ్జనం చేశారు. **-న్యూస్‌టుడే బృందం**

ప్రతిభతో మురిసె..



రామచంద్రపురం వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతగా నిలిచాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఎంపీ గంటి హరీష్ మాధుర్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

- న్యూస్‌టుడే, రామచంద్రపురం

పల్లె పండగకు వేళాయె..

రూ.83.15 కోట్లతో 938 అభివృద్ధి పనులకు శ్రీకారం

దసరా పండగ ముగిసింది. ఇక పల్లె పండగ మొదలవుతోంది. జిల్లాలో సోమవారం నుంచి ఈ నెల 20 వరకు వారంపాటు పల్లె పండగ వారోత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. వారోత్సవాల్లో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్నారు.



శంకుస్థాపనల రోజు వారీ షెడ్యూల్ ఇలా...

తేదీ	పంచాయతీలు	పనుల సంఖ్య
14	39	229
15	63	175
16	30	95
17	40	126
18	28	91
19	40	148
20	13	74

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం), ధవళేశ్వరం

జిల్లాలోని నియోజకవర్గాల పరిధిలోని 253 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) కింద మొత్తం రూ.83.15 కోట్ల నిధులతో 938 అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో అయిదేళ్లుగా గ్రామీణ ప్రాంతాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ముఖ్యంగా గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారవ్వడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కనీసం కాలువల సౌకర్యం కూడా మెరుగుపడక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల మెరుగుపై దృష్టిసారించింది. ఇటీవల నిర్వహించిన గ్రామ సభల ద్వారా చేపట్టాల్సిన పనులను గుర్తించగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె పండగ వారోత్సవాల ద్వారా వాటిని చేపట్టేందుకు జిల్లా అధికారులు రంగం సిద్ధం చేశారు. తొలుత సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. సంక్రాంతి నాటికి అన్ని పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టనున్నారు.

నేడు సింగవరంలో సీసీ రోడ్లకు మంత్రి శంకుస్థాపన

పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నిడదవోలు మండలం సింగవరం గ్రామంలో రూ.30.98 లక్షలతో పట్టనున్న ఆరు సీసీ రహదారుల అభివృద్ధి పనులకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పాటు షెడ్యూల్ ప్రకారం ఆయా నియోజకవర్గాల్లోని గ్రామపంచాయతీల పరిధిలో స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.


సింగవరంలో మంత్రి దుర్గేష్ ప్రారంభించనున్న సీసీ రహదారి నిర్మాణ పనుల శిలాఫలకం

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రరం కలెక్టరేట్: జిల్లాస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. సమీపంలోని కార్యాలయాల్లోనూ అర్జీలు అందించవచ్చని తెలిపారు.

నవ్వుల హయాతీ



రాజోలు మండలం తాటిపాకలో ఆదివారం సినీనటి డింపుల్ హయాతీ సందడి చేశారు. ఓ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవానికి హాజరైన ఆమెను చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబర్చారు. ఈ సందర్భంగా ఆమె వేదికపై నృత్యం చేసి అందరినీ అలరించారు.

-న్యూస్‌టుడే, రాజోలు


శ్రీమహావిష్ణువు అలంకారంలో ఉభయ దేవేరులతో వేంకటేశ్వరస్వామి

శేషాచలానికి తిరుకల్యాణోత్సవ శోభ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీవారి నిత్య కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై సర్వాభరణ భూషితుడైన శ్రీనివాసుడు పెండ్లికుమారునిగా, శ్రీదేవి భూదేవి అమ్మవార్లు పెండ్లికుమార్తెలుగా ఉత్సవ మూర్తులను ముస్తాబు చేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారు శ్రీమహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు హంస వాహనంపై గ్రామోత్సవం ఉంటాయి.



వధువే వరుడై..

వివాహ వేడుకల్లో వరుడు వధువు వేషధారణ.. వధువు వరుడు వేషధారణ ధరించి గ్రామంలోని గంగాలమ్మ తల్లి ఆలయానికి మొక్కులు చెల్లించుకుంటారు. ఇదీ నల్లజర్ల మండలం పోతవరంలో గన్నమనేని కుటుంబ సభ్యుల ఇంట ఆచారం. ఆ కుటుంబానికి చెందిన శ్రీనివాస్ కుమార్తె నవ్యశ్రీకి వివాహం నిశ్చయమైంది. ఈ క్రమంలో శనివారం వధువు నవ్యశ్రీ వరుడు వేషధారణలో గంగాలమ్మ తల్లి ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, నల్లజర్ల



గంగమ్మ వేలువిడిచిందా గణపయ్యా!

భక్తిశ్రద్ధలతో నవరాత్రులు పూజించిన గణపయ్యను గంగమ్మ తన ఒడిలోకి చేర్చుకోలేకపోతోంది. నిమజ్జనం జరిగి నెల రోజులు గడుస్తున్నా విఘ్ననాయకుడి విగ్రహాలు నేటికీ నదీ తీరానే దర్శనమిస్తున్నాయి. వీటన్నింటికీ కారణం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియోగించడమే. ఓ పక్క మట్టి గణపతులనే వాడాలని పర్యావరణ నిపుణులు చెబుతున్నా వారి మాటలను పెడచెవిన పెడుతున్నాం. రసాయనాలతో కూడిన రంగు విగ్రహాలను వాడి ఫలితంగా గోదావరి జలాల కలుషితానికి కారకులవుతున్నాం. సీతానగరం మండలం వంగలపూడి వద్ద గోదారమ్మ వెనక్కి తగ్గడంతో ఆదివారం పార్వతి తనయుడి ప్రతిమలు బయటపడ్డాయి.

- న్యూస్‌టుడే, సీతానగరం



పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

టెట్‌కు 876 మంది హాజరు

శ్యామలా సెంటర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. రాజమహేంద్రవరం లూథర్‌గిరి ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 960కి 876 మంది హాజరుకాగా 84 మంది గైర్హాజరయ్యారని డీఎస్ఈఓ కె. వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



కబడ్డీలో ప్రథమ బహుమతి సాధించిన తూర్పు గోదావరి పురుషుల జట్టుకు నగదు బహుమతి అందజేత

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజయం

మంగళగిరి, న్యూస్‌టుడే: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో గుంటూరు జిల్లా మంగళగిరిలో 'ప్రైడ్ ఆఫ్ మంగళగిరి' పేరుతో నాలుగు రోజులుగా నిర్వహిస్తోన్న రాష్ట్ర స్థాయి కబడ్డీ లీగ్ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఫైనల్స్‌లో పురుషుల విభాగంలో తూర్పుగోదావరి విజేతగా నిలవగా.. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ సహకారంతో రూ.లక్ష నగదు, ట్రోఫీ అందించారు.

ఇక సాగునీటి సంఘాలకు ఎన్నికలు


- ఈనెల 16న నోటిఫికేషన్
- నవంబరు 14లోపు కమిటీల ఏర్పాటు

న్యూస్‌టుడే, సీతానగరం, కొంతమూరు

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈనెల 16న నోటిఫికేషన్ జారీ చేసి నవంబరు 14లోపు కమిటీలను ఏర్పాటు చేయాలనే జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాలను సిద్ధం చేసేలా రెవెన్యూ యంత్రాంగం కదిలింది.

వైకాపా ప్రభుత్వంలో రద్దు

1997లో తెదేపా ప్రభుత్వం సాగునీటి సంఘాల వ్యవస్థను తీసుకొచ్చింది. ఆ సమయంలోనే పంటకాలువల పరిధిలోని రైతులకు ఓటు హక్కు కల్పించారు. 2015లో అప్పటి తెదేపా ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో సాగునీటి సంఘాల ఛైర్మన్లను నియమించారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థ పర్యవేక్షణలో కీలకమైన సాగునీటి సంఘాలు ఉనికిని కోల్పోయాయి. తెదేపా హయాంలో సంఘాలు ఏర్పడ్డాయనే అక్కసుతో వీటిని రద్దు చేసింది. దీంతో సాగునీటి రంగానికి తీవ్ర నష్టం కలిగింది. కాలువలకు మరమ్మతులకూ వీలు లేకపోయింది.


పురుషోత్తపట్నం వద్ద తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం

కూటమి నిర్ణయం వల్ల..

40 రోజుల వ్యవధిలోనే సాగునీటి సంఘాలకు కమిటీలు రానున్న నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలోని పుష్కర ఎత్తిపోతల పథకం పరిధిలోని మెట్ట వరకు 39 వేల ఎకరాలకు ఒక డిస్ట్రిబ్యూటరీ కమిటీ రానుంది. తొర్రిగడ్డ, చాగల్నాడు, వెంకటనగరం మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో ఒక ఛైర్మన్ పదవితో పాటు 44 సాగునీటి సంఘాలు ఏర్పడనున్నాయి. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో 39 వేల ఎకరాల ఆయకట్టు రైతులకు ఓటుహక్కుతో ఒక డిస్ట్రిబ్యూటరీ రానుంది.

వేగవంతంగా జాబితాలు

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈనెల 16న నోటిఫికేషన్ జారీచేయనున్నాం. ఓటరు జాబితాలు సిద్ధమవుతున్నాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తాం.

-కె.వెంకటేశ్వరరావు, డీఈ, జలవనరులశాఖ, ధవళేశ్వరం

రకం	ప్రాజెక్టు	డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీ)	సాగునీటి సంఘాలు (డబ్ల్యూయూఏ)
మేజర్	తోట వెంకటాచలం పుష్కర-1,2	01	--
చిన్నతరహా	తొర్రిగడ్డ	01 (ఛైర్మన్)	04
॥	చాగల్నాడు, వెంకటనగరం	01	44

పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి గెలుపు అవసరం: ఎమ్మెల్సీ ఐవీ


సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఉద్యమాల్లో పాల్గొన్న గోపిమూర్తి గెలుపు అవసరమని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. త్వరలో జరగబోయే ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో పీడీఎఫ్ నుంచి బొర్రా గోపిమూర్తిని అభ్యర్థిగా పరిచయం చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి పలు అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు హాజరయ్యాయి. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చుక్కారామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్, ఎంఎస్‌శర్మ, డాక్టర్ గేయానంద్ వంటి అభ్యర్థులు పీడీఎఫ్ నుంచి ఎమ్మెల్సీలుగా గెలుపొంది సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ గోపి మూర్తిని గెలిపించాలన్నారు. ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలను శాసన మండలిలో ప్రతిబింబిస్తానని గోపిమూర్తి అన్నారు. ఎన్.అరుణకుమారి, జయకర్, షరీఫ్ పాల్గొన్నారు.

వైకాపా నాయకుడి దాష్టీకం

- అప్పు తీర్చమన్నందుకు తండ్రీ కుమార్తెపై దాడి
- నిందితుడు మాజీ ఎంపీ భరత్ ముఖ్య అనుచరుడు


దాడికి గురైన నాగరాజు, కావ్యశ్రీ

రాజమహేంద్రవరం నేరవార్తలు: తీసుకున్న అప్పు తీర్చమని అడిగేందుకు వెళ్లిన ఓ తండ్రి, కుమార్తెపై వైకాపా నాయకుడు దాడిచేసిన ఘటన రాజమహేంద్రవరం ప్రకాశంనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ బాజీలాల్, బాధితుల వివరాల మేరకు.. విజయవాడ కుంచనపల్లికి చెందిన కాజా కావ్యశ్రీ అనే యువతి పలు ఈవెంట్స్‌కు వ్యాఖ్యాత(యాంకరింగ్)గా చేస్తూ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఆమెకు రాజమహేంద్రవరానికి చెందిన వైకాపా నాయకుడు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అనుచరుడైన నల్లూరి వెంకట శ్రీనివాస్ కుమారుడు ఎన్.అభిలాష్‌తో స్నేహం ఉంది. ఆ క్రమంలో అభిలాష్ తాను చేసే వ్యాపారానికి రూ.3 లక్షలు అప్పుగా కావాలని కావ్యశ్రీని అడగడంతో ఆమె 2021లో నగదు ఇచ్చారు. ఆనాటి నుంచి వడ్డీ ఇవ్వకపోగా, అసలు గురించీ మాట్లాడటం మానేశాడు. ఆ విషయాన్ని అభిలాష్ తండ్రి శ్రీనివాస్ వద్దకు వచ్చి ఆ యువతి పలుమార్లు చెప్పారు. ఏళ్లు గడుస్తున్నా సాకులు చెప్పడంతో పాటు తండ్రీ కొడుకులు ఇద్దరూ కావ్యశ్రీ ఫోన్‌కు స్పందించ లేదు. ఆదివారం కోనసీమ జిల్లా తాటిపాకలో ఓ ఈవెంట్‌కు యాంకరింగ్ చేసే క్రమంలో యువతి రాజమహేంద్రవరం వచ్చారు. ఆ క్రమంలోనే తన తండ్రి నాగరాజుతో కలసి ఆమె.. శ్రీనివాస్ ఇంటికి వెళ్లారు. అక్కడ అభిలాష్ లేకపోవడంతో తమ వద్ద తీసుకున్న నగదు ఇవ్వాలని శ్రీనివాస్‌ను నిలదీశారు. నగదు అడిగేందుకు ఇంటికే వస్తారా అని నాగరాజుతో పాటు కావ్యశ్రీపైనా శ్రీనివాస్ విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఆ క్రమంలో బాధితురాలు పోలీసుస్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గతంలో వైకాపా అధికారంలో ఉన్న సమయంలో నాటి ఎంపీ ప్రధాన అనుచరుడిగా ఉన్న శ్రీనివాస్ అనేక సెటిల్‌మెంట్లతో పాటు ఆ పార్టీలోనే పలువురు నాయకులతో తగాదాలు పడినట్లు అభియోగాలున్నాయి.


దాడిచేస్తున్న శ్రీనివాస్

శరణు దుర్గా.. శరణు..

దసరా ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. దేవీ శరన్నవరాత్రుల్లో అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించిన భక్తులు వేడుకలు ముగిసిన సందర్భంగా దీక్షలు విరమించారు. శమీ వృక్షానికి పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ఆలయాలు, ఐహరాల వేదికలపై తొమ్మిది రోజుల పాటు కొలువుదీరిన అమ్మవార్లకు భక్తులు శక్తికొలది నైవేద్యాలు సమర్పించి దీవెనలందించాలని వేడుకున్నారు. ఉత్సవాలు ముగిసిన సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదానాలు ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, బృందం



రాజమహేంద్రవరం: కనకదుర్గమ్మకు పూజలు



తాళ్లపూడిలో రాజరాజేశ్వరిగా...





దేవీచౌక్‌లో అమ్మవారు, బారులు దీరిన భక్తులు



రాజమహేంద్రవరంలో జమ్మిచెట్టుకు పూజలు



అన్నవరంలో బాణసంచాతో తీర్చిదిద్దిన రావణాసురుడి బొమ్మ

వెళ్లొస్తాం.. మళ్లొస్తాం..

దసరా తిరుగు ప్రయాణాలు మొదలు

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: దసరా పండుగ ముగియడంతో తిరుగు ప్రయాణాలు మొదలయ్యాయి. పండగకు వివిధ ప్రాంతాలను నుంచి జిల్లాలోని సొంతూర్లు, బంధువుల ఇళ్లకు వచ్చిన వారు ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. సాయంత్రం నుంచి మరింత రద్దీ పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీకాకుళం తదితర దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో దానికనుగుణంగా జిల్లా ఆర్టీసీ ప్రత్యేక, అదనపు సర్వీసులు ఏర్పాటు చేసింది. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి హైదరాబాద్‌కు ఎనిమిది షెడ్యూల్ సర్వీసులు నడుస్తుండగా మరో ఎనిమిది ప్రత్యేక సర్వీసులు తిప్పింది. రాజమహేంద్రవరం డిపో నుంచి అయిదు, కొవ్వూరు, నిడదవోలు, గోవరం డిపోల నుంచి ఒక్కొక్కటి చొప్పున ప్రత్యేక సర్వీసులు నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నానికి అదనంగా 12 బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం షబ్నం తెలిపారు.



హైదరాబాద్‌కు వెళ్లే ప్రత్యేక బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

రైల్వేస్టేషన్లు కిటకిట

తిరుగు ప్రయాణికుల రద్దీతో రైల్వేస్టేషన్లు సైతం కిటకిటలాడుతున్నాయి. జిల్లాకేంద్రమైన రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం నుంచి రద్దీ పెరిగింది. కొన్ని షెడ్యూల్ రైళ్లతో పాటు ప్రత్యేక రైళ్ల ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులకు గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. తెల్లవారుజాము 4 గంటలకు ఇక్కడి ప్రధాన రైల్వేస్టేషన్‌కు రావాల్సిన హౌరా మెయిల్ మధ్యాహ్నం 1.43 గంటలకు వచ్చినట్లు ప్రయాణికులు చెబుతున్నారు. 12.10 గంటలకు రావాల్సిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చింది. ఉదయం 10.28 గంటలకు రావాల్సిన చెన్నై నుంచి సంత్రగాచి వెళ్లే ప్రత్యేక రైలు మధ్యాహ్నం 12.50 గంటలకు, ఉదయం 10.13 గంటలకు రావాల్సిన షాలిమార్-తిరునెల్వేలి ప్రత్యేక రైలు మధ్యాహ్నం 1.08 గంటలకు వచ్చింది. పండగ రద్దీ నేపథ్యంలో శ్రీకాకుళంరోడ్డు-విజయవాడ ప్రత్యేక రైలు నడిచింది. ఇక ఇక్కడి నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే ప్రయాణికులతో సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో మరింత రద్దీ నెలకొంది.

ఆటోను ఢీకొట్టిన అనపర్తి మాజీ ఎమ్మెల్యే కారు

నలుగురికి స్వల్ప గాయాలు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అనపర్తి మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి ప్రయాణిస్తున్న కారు రామచంద్రపురం మండలం ఎ.అగ్రహారం వద్ద ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవరు, ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆదివారం కాకినాడ నుంచి రామచంద్రపురం వైపు వస్తున్న ఆయన కారు ఎదురుగా వస్తున్న ఆటో ఒకదానిని ఒకటి తప్పించుకొనే క్రమంలో ఢీకొట్టుకున్నాయి. కారు ముందు భాగం ఆటో వెనుక భాగంలో తగలడంతో ఆటో బోల్తాపడింది. క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే తన కారులో కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులను వివరాలు అడగ్గా, ప్రమాదానికి సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కాల్‌మనీ కేటుగాళ్లు

అధిక వడ్డీల వడ్డింపు.. చెల్లించకుంటే వేధింపులు



రూ.వేలల్లో అప్పులిస్తారు.. వడ్డీ మీద వడ్డీలు వేసి రూ.లక్షలు, రూ.కోట్లు చెల్లించాలని వేధిస్తారు. కుదరదంటే కోర్టు నోటీసులు పంపిస్తారు. ఇదీ జిల్లాలోని పెరిగిపోతున్న కాల్‌మనీ దందా. వేధింపులు భరించలేక పోతున్నాం బాబోయ్ అంటూ బాధితులు జిల్లా యంత్రాంగాన్ని ఆశ్రయిస్తున్నారు.

– న్యూస్‌టుడే, మండపేట

మండపేట పరిసర ప్రాంతాల్లో వేలల్లో అప్పులిచ్చి.. అది తీర్చలేకపోయినా ఇంకా చెల్లించాలంటూ వేధింపులకు గురిచేస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఎక్కువ గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం.. గత సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా మండపేట విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. చిన్నచిన్న వ్యాపారాలు చేసి జీవనం సాగించే వారు అవసరార్థం బయటనుంచి వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకున్నారు. అడిగిన వెంటనే అప్పు దొరుకుతుండటంతో దస్తావేజులు తనఖా పెట్టి.. ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేసి నగదు తీసుకుంటున్నారు. నెలనెలా సక్రమంగా వడ్డీ చెల్లించి, కొంత అప్పు తీరిన తరువాత వ్యాపారులు కోర్టు నోటీసులు ఇస్తున్నారు. తాము పొందిన రుణానికి అయిదారు రెట్లు నగదు చెల్లించాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొంటున్నారు. ఎవరికీ చెప్పుకోలేక పాలుపోక మానసిక వేదనకు గురవుతున్నారు. ఇటీవల ఒక కుటుంబం తల్లిదండ్రులతో ఇద్దరు కుమారులు వారణాసిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనకు ఈ కాల్‌మనీ వ్యవహారమే కారణమని స్థానికంగా చర్చ జరుగుతోంది.

రాజకీయ పలుకుబడితో బెదిరింపు

అప్పు పుట్టిందన్న సంతోషంలో ఎటువంటి ఆధారాలు తమ వద్ద ఉంచుకోకపోవడం బాధితులకు ఇబ్బందిగా మారింది. ఈవిధంగా మండపేట పరిసర ప్రాంతాల్లో 75 మంది వరకు బాధితులు ఉండొచ్చని అంచనా. నలుగురు వ్యాపారులు వీరిని వేధింపులకు గురిచేస్తున్నారు. అడిగినంత నగదు చెల్లించాలని రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఇళ్లకు వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు.

రూ.కోటి చెల్లించమంటున్నారు..



2014లో వ్యాపార అవసరాల కోసం రూ.5 లక్షలు అప్పు తీసుకున్నా. 2016లో పూర్తిగా చెల్లిద్దామని ప్రామిసరీ నోటు ఇమ్మని అడిగితే.. అప్పటికే తీసుకున్న అప్పుపై రూ.32 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం రూ.1.05 కోట్లు చెల్లించాలంటూ కేసు వేశారు. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

- ఎం.రామ్‌రహీమ్

ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదు..



గతంలో ఓ వ్యాపారి వద్ద రూ.60 వేలు అప్పు తీసుకుని రూ.30 వేలు చెల్లించా. ఇంకా రూ.6 లక్షలు ఇవ్వాలంటూ కోర్టు నోటీసులు ఇచ్చారు. బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగస్టులో పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసేందుకు నిరాకరించారు.

- దంగేటి దుర్గాప్రసాద్


రూ.20 వేలకు రూ.2.50 లక్షలు ఇమ్మంటున్నారు..



చిన్న వ్యాపారం చేస్తున్నా. రెండేళ్ల క్రితం దస్తావేజులపై రూ.20 వేలు తీసుకుని రోజుకు రూ.300 వడ్డీతో పూర్తిగా చెల్లించా. దస్తావేజులు అడిగితే ఇవ్వకుండా సంవత్సరం పోయాక రూ.2.50 లక్షలు ఇవ్వాలంటూ కోర్టులో కేసు వేశారు.

- ప్రసాద్, బాధితుడు, మండపేట

నెలకు రూ.4 వేలు వడ్డీ..



సంవత్సరం క్రితం వేములపల్లి జగన్నగ లేఅవుట్‌కు సంబంధించిన దస్తావేజు ష్యూరిటీగా పెట్టి మా అమ్మ వరలక్ష్మి రూ.70 వేలు తీసుకున్నారు. ప్రతి నెలా రూ.4 వేలు వడ్డీ చెల్లించాం. పనుల్లేక కొంతకాలం వడ్డీ చెల్లించలేదు. తరువాత దస్తావేజుల కావాలంటే రూ.2.20 లక్షలు కట్టాలన్నారు.

- శ్రీను, బాధితుడు

పరిశీలించి చర్యలు

బాధితులు ఇచ్చిన ఫిర్యాదులన్నీ కోర్టుల పరిధిలో ఉన్నాయి. ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదు. పూర్తిగా విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సైకి ఆదేశాలు జారీ చేశాం. నివేదికనుబట్టి మా పరిధిలోని అంశాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- దొరరాజు, సీఐ, మండపేట రూరల్

దేవుడిలా వచ్చాడు..!

- యువకుడి సాహసం..
- ఇద్దరికి పునర్జన్మ

తణుకు గ్రామీణం, పెరవలి: ఆ యువకుడు చూపించిన తెగువ, ధైర్య సాహసాలు ఇద్దరికి పునర్జన్మనిచ్చింది. కాలువలో కారు మునిగిపోతుంటే చూస్తున్నారే తప్ప ఎవరు దిగేందుకు సాహసం చేయలేదు. ఓ యువకుడు మాత్రం ఏం ఆలోచించకుండా వారిని రక్షించాలన్న లక్ష్యంతో కాలువలోకి దూకేశారు. అతడికి ఈత రాకపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. తణుకు పట్టణానికి చెందిన దాసరి రాంబాబు ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నారు. రెండో కుమార్తె మౌనికదేవి చెన్నైలో ఉద్యోగం చేస్తూ దసరా సెలవులకు స్వగ్రామం వచ్చారు. శనివారం తండ్రితో కలిసి కారులో మండపాక యల్లారమ్మ దేవాలయానికి బయల్దేరారు. వెంకటరాయపురం ఆంధ్రసుగర్స్ పరిశ్రమ ఎదురుగా వచ్చేసరికి కారు అదుపు తప్పి గోస్తనీ కాల్వలోకి దూసుకెళ్లింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న పెరవలి మండలం నల్లాకులవారిపాలెంకు చెందిన మెర్ల సాయిబాబు తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా కాలువలోకి దూకి వారిని రక్షించే ప్రయత్నం చేశారు. రోడ్డుపై ఉన్న మరో వ్యక్తి అతనికి అందించిన సుత్తితో కారు అద్దాలు పగులగొట్టి ఇద్దరినీ ప్రాణాలతో ఒడ్డుకు తెచ్చారు.

- రాంబాబు భార్య కొన్ని నెలలుగా మంచానికే పరిమితమయ్యారు. ఈ తరుణంలో కారులో మునిగిపోతుండగా ఆమె పరిస్థితి ఏమిటి..? ఆమెను ఎవరు చూసుకుంటారు...? అనే ఆలోచన తనను ఎంతగానో కలచివేసిందంటూ సాయిబాబును రాంబాబును హత్తుకుని కన్నీరు మున్నీరయ్యారు.
- స్థానిక తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ, సాయిబాబును ఘనంగా సత్కరించారు. ఈ సంఘటన మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. సాయిబాబుకు జ్ఞాపిక, రూ.10వేల నగదు బహుమతిగా అందించి అభినందించారు.



సాయిబాబాను సన్మానిస్తున్న తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

పోరాట యోధుడు సాయిబాబా

అమలాపురం పట్టణం: మానవ హక్కుల ఉద్యమకారుడు, ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా మృతితో ఆయన స్వస్థలం అమలాపురంలో విషాదం అలముకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం నల్లమిల్లిలో పుట్టిన ఆయన భవితకు పునాది ఇక్కడే పడింది. ఇక్కడ చదువుతున్న రోజుల నుంచే పేదలకు సాయం చేయాలని తపించేవారు. అనంతరం హక్కుల పోరాటం కోసం పోరాటం చేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

- ఆదివాసీలు, పీడిత ప్రజల కోసం మేధావులతో కలసి ఉద్యమాలు చేసిన ప్రొఫెసర్ సాయిబాబా పోరాట యోధుడని పౌరహక్కుల, ప్రజా సంఘ నాయకులు కొనియాడారు. సాయిబాబా మృతి పట్ల అమలాపురంలోని గడియారస్తంభం ప్రాంగణంలో ఆదివారం సంతాప సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బంధువు గంగుమళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ సాయిబాబా పేదల పక్షాన పోరాడారన్నారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో జైలులో పెట్టినా నిర్దోషిగా విడుదలయ్యారన్నారు. ఇంతలోనే తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూయడం బాధాకరమన్నారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్నా ఉద్యమాల బాట పట్టారన్నారు. ఆయనను అన్యాయంగా జైలులో పెట్టి మరణించేలా చేశారన్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తామంటూ గడియారం స్తంభం ప్రాంగణంలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లెల మనోహర్, బాబురావు, ఇక్బాల్ రాజేష్, త్రిమూర్తులు, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



అమలాపురంలో నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఐకమత్యంతోనే సమస్యలు పరిష్కారం

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం న్యూస్‌టుడే: ఐక్యమత్యంతోనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని మహాసేన రాజేష్ పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి మాలల ఐక్యత సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహాసేన రాజేష్ హాజరై మాట్లాడారు. ఎస్సీల రిజర్వేషన్ల పరిరక్షణ, మత స్వేచ్ఛ ఐక్యం కావాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను విడగొట్టి మాలలకు రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకు కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయన్నారు. మాలల రిజర్వేషన్లు పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అందుకు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. దళిత సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బచ్చల కామేశ్వరరావు మాట్లాడుతూ దళితులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు రిజర్వేషన్లు ఉపయోగపడతాయన్నారు. బీమ్ ఆర్మీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి శివకుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ఏకం కావాలన్నారు. జిల్లా తెదేపా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొల్లాబత్తుల అప్పారావు మాట్లాడుతూ రిజర్వేషన్లతో ఎస్సీలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాల నాయకులు జంగా బాబూరావు, ఖండవల్లి లోవరాజు, కుంచే శ్రీహరి, నక్కా చిట్టిబాబు, యాదల సత్యనారాయణ, రేవు సుబ్బారావు, బచ్చల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మాలల ఐక్యత సభలో మహాసేన రాజేష్, నాయకులు

జూదరులపై కేసు

నల్లజర్ల, న్యూస్‌టుడే: నల్లజర్ల శివారులో ఆదివారం రాత్రి జూదం ఆడుతున్న వారిపై నల్లజర్ల పోలీసులు ప్రత్యేక బృందంతో కలిసి దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.17 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. చాదరాశిగుంటలో జూదం ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,100 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు నల్లజర్ల సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

ఆదమరిచేలా చేసి.. దోచేసి..

అయిదుగురు అంతర్ జిల్లాల నేరస్థులు అరెస్ట్

గండేపల్లి, న్యూస్‌టుడే: సాధారణ ప్రయాణికుల్లా ఆటోలు, బస్సులు ఎక్కుతారు. పక్కనున్న వారిని ఆదమరిచేలా చేస్తారు. అనంతరం బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్, విలువైన వస్తువులు దోచుకుంటారు. ఇలాంటి చోరీల్లో ఆ మహిళలు ఆరితేరితే వారికి సహాయకుడిగా మరో వ్యక్తి ఉన్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలో చోరీ చేస్తూ దొరికిపోయిన మహిళను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేయడంతో ముఠా గుట్టురట్టయింది. అంతర్ జిల్లాలకు చెందిన నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని పట్టుకుని వారి నుంచి విలువైన బంగారు అభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. విశాఖపట్నానికి చెందిన మహిళ ఈనెల 7వ తేదీన పిల్లలతో కలిసి ఏలేశ్వరంలోని తన అక్క ఇంటికి వచ్చారు. అనంతరం ఆమె ఆటో ఎక్కి మురారి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా అదే ఆటో ఎక్కిన మరో మహిళ ఈమెతో మాటలు కలిపి బ్యాగ్‌లోని బంగారు వస్తువులను దోచుకుంది. దీనిపై ఈనెల 11న గండేపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా చోరీకి పాల్పడిన అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన రావుల దుర్గ (40)తో పాటు అదే ప్రాంతానికి చెందిన మెరకనపల్లి వెంకటేశ్వరరావు (50), విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన గంటా రేవతి (25), అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన రావుల వసంత, గోకవరం డ్రైవర్స్‌కాలనీకి చెందిన నాగులూరి శివపార్వతి (30)ని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువైన 100 గ్రాముల బంగారు అభరణాలు, కారు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరు గతంలో విశాఖ, గుంటూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరులో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. గండేపల్లి ఎస్సై శివనాగబాబు, ఏఎస్సై శేఖర్, సిబ్బంది వీరబాబు, సూరిబాబు, బాషా ఉన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు అభరణాలు, చరవాణులు

ప్రమాదంలో భవాని మాలధారిణి మృతి

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆగి ఉన్న ప్రైవేటు బస్సును వెనుక నుంచి వ్యాను ఢీకొన్న ప్రమాదంలో భవాని మాలధారిణి మృతి చెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా తలపాక గ్రామానికి చెందిన పోలవరపు అప్పల నరసమ్మ(50) బంధువులతో కలిసి భవాని మాల దీక్షను విరమించేందుకు బస్సులో విజయవాడ బయలుదేరారు. కొవ్వూరు పట్టణ శివారు వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న వాహనం టైర్లలోని గాలిని తనిఖీ చేసేందుకు డ్రైవర్ బస్సు ఆపారు. ఇంతలో వెనుక నుంచి ఐషర్ వ్యాన్ వచ్చి ఆగి ఉన్న బస్సును ఢీకొట్టడంతో బస్సులో ఉన్న నరసమ్మ తీవ్ర గాయాలపాలయ్యారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు నరసమ్మను పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మరో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంపై పట్టణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోడ పైనుంచి పడి యువకుడి దుర్మరణం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గోడపై నుంచి జారి పడి యువకుడు మృతి చెందిన ఘటన పొలమూరులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. దేవి నవరాత్రి పూజల్లో భాగంగా అనపర్తి మండలం పొలమూరులోని దేవిసెంటర్ వద్ద గల దేవి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. దానిలో భాగంగా గ్రామానికి చెందిన సత్తి వీరరాఘవరెడ్డి (33) అన్నసమారాధన నిమిత్తం టెంట్ వేసేందుకు గోడ ఎక్కి తాడు కడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు. దీంతో కుడిచెంపపై బలమైన గాయాలు అయ్యాయి. దీంతో అతడ్ని ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని, మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై శ్రీనునాయక్ తెలిపారు. ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అందజేసినట్లు తెలిపారు. వీరరాఘవరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



వీరరాఘవరెడ్డి (పాత చిత్రం)

రాజమహేంద్రవరం

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాట-42/36, వంకాయలు నలుపు-34/గులాబీ-50/తెలుపు-38/దొప్పలు-50, బెండ-30, కాకర-30, బీర పందిరి-34/30, దొండ-26, క్యారెట్-44/మట్టికాడ-38, బీట్‌రూట్-36, గోరుచిక్కుడు-30, దోస-32, ఆనబ కాయ-38/40, చిక్కుళ్లు-80/దేశవాళీ-94.

సినిమాలు: దానవాయిపేట: శ్యామల, ఊర్వశి: వేట్టయన్, రాజా: మార్టిన్, కుమారి, శ్రీ: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమహల్: జిగ్రా, రంభ: మా నాన్న సూపర్ హీరో, మేనక: సత్యం సుందరం, మార్టిన్,(రెండేసి ఆటలు), వీవీస్ మహల్: వేట్టయన్, దేవర(రెండేసి ఆటలు).

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీలో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగా చేరిన వారికి జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ పార్టీ పునర్వైభవానికి కృషి చేయాలన్నారు. నాయకులు బాలేపల్లి మురళీధర్, మార్టిన్ లూథర్, డాక్టర్ వడయార్, మోతా శారద, కాటం రవి తదితరులు పాల్గొన్నారు.

సమాజ లోపాలను సరిదిద్దేదే కవిత్వం


మాట్లాడుతున్న ఎస్‌కేవీటీ ప్రిన్సిపల్ రాజబాబు తదితరులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సమాజ లోపాలను సరిదిద్దగలిగేదే కవిత్వమని ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ఎవిఎల్ రాజబాబు అన్నారు. కళాగౌతమి ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో ఆదివారం జరిగే రచయితల సమావేశం వైజంక్షన్‌లోని కందుకూరి నాటక సమాజంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజబాబు మాట్లాడుతూ కవిత్వం ప్రజా జీవితాన్ని ప్రభావితం చేసి సమాజాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. కళాగౌతమి అధ్యక్షుడు పి.వి.బి.సంజీవరావు, మల్లెమొగ్గల గోపాలరావు, ముంగండ సూర్యనారాయణ, వి.వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం


గురువులను సత్కరించిన పాడే పాఠశాల పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం పాడే ఆంగ్ల మాధ్యమ పాఠశాల 2002 పదోతరగతి విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత సమావేశం నిర్వహించారు. ఆదివారం ఆనంద్ రీజెన్సీ హోటల్‌లో ఆత్మీయ వాతావరణంలో జరిగిన కార్యక్రమంలో హాజరైన స్నేహితులు ఆనాటి మధుర జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ సందడి చేశారు. తమకు చదువు నేర్పిన గురువులు విజయ కుమారి, నిర్మలా కుమారి, పద్మలత, సరిత, సుధ టీచర్లను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఆనంద్‌రాజ్, అనిల్, విజయ్, శ్రీకర్, స్వాతి తదితరులు పర్యవేక్షించారు.

నల్లబజారుకు పేదల బియ్యం

✦ ఆగని అక్రమ తరలింపు
✦ క్షేత్రస్థాయిలో కొరవడిన నిఘా

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం


గ్రామీణంలో వీధి అరుగులపై మూటలు కట్టి తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యం

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతినెలా పేదలకు ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. క్షేత్రస్థాయిలో నిఘా కొరవడటంతో రేషన్ బియ్యం యథేచ్ఛగా నల్లబజారుకు తరలిపోతున్నాయి. స్వయంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలు మిల్లుల్లో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు గుర్తించి చర్యలకు ఆదేశించినా అక్రమ రవాణా మాత్రం ఆగడంలేదు. రాజమహేంద్రవరం డివిజన్‌లోని పలు మండలాల్లో శుక్రవారం కూడా దళారులు రేషన్ బియ్యాన్ని ద్విచక్రవాహనాలపై తరలించారు. ప్రస్తుత నెలకు సంబంధించి ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరకులు పంపిణీ జరుగుతోంది. ప్రతినెలా 1 తేదీ నుంచి 17 వ తేదీ వరకు రేషన్ సరకుల పంపిణీ జరుగుతుంది. క్షేత్రస్థాయిలో రేషన్ సరకుల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాల్సిన మండల సప్లై అధికారులు (సీఎస్ డీటీ)లు క్షేత్రస్థాయిలో కన్పించడంలేదు. దీంతో దళారులు వీధివీధిన ద్విచక్రవాహనాలపై తిరుగుతూ లబ్ధిదారుల నుంచి కిలో బియ్యం రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వీటిని మూటలుగా కట్టి వీధుల్లో ఒకచోట పెట్టి అక్కడి నుంచి వాహనాలపై యథేచ్ఛగా తరలించుకుపోతున్నా పట్టించుకునే నాథుడే లేరు. డివిజన్‌లో పది మండలాలు ఉండగా వీటిలో రాజమహేంద్రవరం అర్బన్, గ్రామీణ మండలాల్లోనే అత్యధిక రేషన్ కార్డులు ఉన్నాయి. అర్బన్ మండలంలో 8,426 కార్డులు, గ్రామీణ మండలంలో 51,085 కార్డులు ఉన్నాయి. డివిజన్ మొత్తంలో ప్రతినెలా సుమారు 4,500 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండగా వీటిలో అధిక శాతం ఈ రెండు మండలాల్లోనే పంపిణీ జరుగుతున్నందున దళారులు ఎక్కువ మంది ఇక్కడే వాలిపోతున్నారు.

రాజమహేంద్రవరం డివిజన్‌లో ఇలా...

మండలాలు	- 10
చౌక దుకాణాలు	- 489
ఎండీయూ వాహనాలు	- 224
రేషన్ కార్డులు	- 3,43,397
ప్రతినెలా బియ్యం పంపిణీ	- 4,500 టన్నులు

సీఎస్ డీటీలు ఏం చేస్తున్నట్టు?

విజిలెన్సు అధికారుల తనిఖీల్లో పట్టుబడితే తప్ప పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు వ్యవహారాలు బయటకు రావడంలేదు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన మండల సరఫరా అధికారులు మామూళ్లకు కోసం అటు రేషన్ దుకాణదారులు, ఎండీయూ ఆపరేటర్లతో కుమ్మక్కై బియ్యం అక్రమ నిల్వలు, తరలింపు విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. డివిజన్‌లో అయిదుగురు సీఎస్ డీటీలు ఉండగా రెండేసి మండలాలకు ఒకరికి పర్యవేక్షణ అప్పగించారు. అయినా చర్యలు శూన్యం. రవాణాపై విజిలెన్స్ అధికారులకు సమాచారం వచ్చినప్పుడు వారితో కలిసి దాడులు చేయడం తప్ప నేరుగా వీరు తనిఖీలు చేసిన దాఖలాలు కన్పించడం లేదు. ఏదో మొక్కుబడిగా కొందరిపై 6ఏ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం వల్లే బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటంలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థ పటిష్టం, విస్తృత తనిఖీలకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై డీఎస్‌వో ప్రసాద్‌తో మాట్లాడగా.. క్షేత్రస్థాయిలో రేషన్ సరకుల పంపిణీ తీరును పర్యవేక్షించేలా మండల సప్లయి అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు. అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తామన్నారు.


రైతుబజారులోని బియ్యం ప్రత్యేక కౌంటర్

బియ్యం సరఫరా అంతంత మాత్రం

దేవీచౌక్, న్యూస్‌టుడే: రైతుబజార్లలో ఏర్పాటుచేసిన ప్రత్యేక బియ్యం కౌంటర్లకు సరఫరా అరకొరగా ఉంటోంది. ఆదరణ ఉన్నా సరఫరా సక్రమంగా లేకపోవడంతో కొనుగోలు కోసం వస్తున్న వినియోగదారులు నిరాశగా వెనుతిరిగి వెళ్లి పోతున్నారు. కొన్ని బజార్లలో గత పది రోజుల నుంచీ అందుబాటులో లేవు. బహిరంగ మార్కెట్లో ధరలు నియంత్రించేందుకు రైతుబజార్లలో జులై 7వ తేదీ నుంచి ప్రత్యేక బియ్యం కౌంటర్లు ప్రారంభించారు. రైసు మిల్లర్ల నుంచి వీటికి బియ్యం సరఫరా చేస్తున్నారు. ప్రారంభంలో రెండు రకాలు అందుబాటులో ఉంటాయని ప్రకటించినప్పటికీ రూ.47 రకం ఒక్కటే ఉంటున్నాయి. ప్రస్తుతం ఉన్న వాటికి డిమాండ్ బాగానే ఉంటోంది. రోజుకు పెద్ద బజార్లలో 2-3 క్వింటాళ్లు, మిగతా వాటిలో 1 - 1.50 క్వింటాళ్లు అమ్మకాలు జరుగుతున్నాయి. నిత్యం అందుబాటులో ఉంటే ధరలు అదుపులో ఉండటంతో పాటు వినియోగదారులకు మేలు జరుగుతుంది.

కీర్తిలాల్స్ కొత్త షోరూమ్ ప్రారంభం


జ్యువెలరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే భవాని తదితరులు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): వజ్రాభరణాలలో విశిష్టమైన పేరు గాంచిన కీర్తిలాల్స్ డైమండ్, గోల్డ్ జ్యువెలరీ విజయదశమి సందర్భంగా రాజమహేంద్రరంలోని ఏవీ అప్పారావు రోడ్డులో తమ కొత్త షోరూమ్ ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఆ మేరకు ఆ సంస్థ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్, కీర్తిలాల్స్ మాట్లాడుతూ.. తమ 14వ షోరూమ్‌ను రాజమహేంద్రవరంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తమ వద్ద ఉన్న గోల్డ్ జ్యువెలరీ కలెక్షన్ అండ్ ఇంటిగ్రేటెడ్ బ్రైడల్ స్టూడియో వధువులకు అనుకూలమైన, మరుపురాని షాపింగ్ అనుభవాన్ని అందిస్తున్నారు. అలాగే సున్నితమైన బ్రైడల్ సెట్లు, కంకణాలు, నెక్లెస్, చెవిపోగులతో సహా ఎంపిక చేసిన అన్ని రకాల బ్రైడల్ ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా విలువ ఆధారిత సేవలపై 50శాతం తగ్గింపుతో పాటు, డైమండ్ ఆభరణాలపై క్యారెట్‌కు రూ.12 వేల వరకు తగ్గింపు అందిస్తున్నామని వివరించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం 23వ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్‌లో కాలువల విస్తరణ, కల్వర్టుల నిర్మాణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపించకుండా పూర్తి చేయాలన్నారు. ముంపు నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన ముంపు సమస్యపై ప్రతిపాదనలు సిద్ధం చేసి, పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. యిన్నమూరి ప్రదీప్, సుభాష్, జగదీష్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

కిశోర్ కుమార్ వర్ధంతి


మాజీ ఎంపీ హర్ష కుమార్ ఆధ్వర్యంలో సత్కారం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ హిందీ గాయకుడు కిశోర్ కుమార్ 38వ వర్ధంతి కార్యక్రమం జిత్‌మోహన్ మిత్రా కళావేదికపై జరిగింది. ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో జల్లి శివప్రసాద్‌కు కళాప్రియ, కిశోర్ కుమార్ పురస్కారం అందించి సత్కరించారు. మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్ మాట్లాడుతూ కిశోర్ కుమార్ పాటలంటే తనకు ఎంతో ఇష్టమని, శివప్రసాద్‌కు ఆయన పేరుతో పురస్కారం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పి.వి.ఎస్.కృష్ణారావు, సూరపురెడ్డి తాతారావు, వి.జగపతి, గిరజాల సోమరాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మజోస్యుల సేవలు చిరస్మరణీయం


విగ్రహం వద్ద నివాళి అర్పించిన సభ్యులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్వరాజ్య పోరాటంలో ప్రజల్ని చైతన్యం చేసి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం సేవలు చిరస్మరణీయమని ఆంధ్రకేసరి యువజన సమితి కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. విజయదశమి పర్వదినాన బ్రహ్మజోస్యుల జయంతి వేడుక ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య మైదానంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. పూలమాలవేసి నివాళి అర్పించిన మాదిరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం బలోపేతం కావడానికి సీతానగరం గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమం ఓ కారణమన్నారు. బ్రహ్మజోస్యుల స్థాపించిన ఆశ్రమం వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. దేశిరెడ్డి బలరామనాయుడు, క్రొవ్విడి సుబ్రహ్మణ్యం, దూర్వాసుల సత్యనారాయణ, తొక్కుల రమేష్, పి.వి.ఎస్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన పచ్చిమిర్చి...



దేవీచౌక్, న్యూస్‌టుడే: వరుస సెలవుల కారణంగా దిగుమతి తగ్గి పచ్చిమిర్చి ధర ఒక్కసారిగా భారీగా పెరిగింది. రెండురోజుల క్రితం రాజమహేంద్రవరంలోని రైతుబజార్లలో కేజీ రూ.22 ఉన్న ధర ఆదివారం రూ.42కు చేరుకుంది. బహిరంగ మార్కెట్లో రూ.60 పైనే ఉంది. నగరంలో మొత్తం ఎనిమిది రైతుబజార్లు ఉండగా రోజుకు పెద్ద బజార్లకు 2-3 క్వింటాళ్లు, పెద్దవాటికి 4-6 క్వింటాళ్లు అవసరమవుతాయి. పచ్చిమిర్చి జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఎక్కువగా కడప జిల్లా మైదుకూరు నుంచి దిగుమతి అవుతోంది. పండుగ సెలవుల కారణంగా కోతలు లేక దిగుబడి తగ్గింది. దీంతో ఒక్కరోజులో ధర కేజీకి రూ.18 పెరిగింది. రైతుబజార్లలో కేజీ 11వ తేదీన రూ.22, 12న రూ.28 ఉన్న ఈ ధర 13వ తేదీకి రూ.42కు చేరుకుంది. ధర పెరగడంతో రైతుబజార్లలోని వ్యాపారులు తక్కువ మొత్తంలో కొనుగోలు చేయడంతో మధ్యాహ్నానికే పచ్చిమిర్చి అందుబాటులో లేకుండా పోయింది. దీంతో వినియోగదారులు ఎక్కువ ధరపెట్టి బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వచ్చింది. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించడంతోనే ధర ఒక్కసారిగా భారీగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు. రెండుమూడు రోజుల్లో ధరలు మళ్లీ యథాస్థితికి చేరుకుంటాయని తెలిపారు.

అంబరాన దసరా సంబరం


మార్కండేయస్వామి ఆలయంలో..


కోటిపల్లి బస్టాండ్ వద్ద..


వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో..


దేవీచౌక్‌లో కుటుంబ సభ్యులతో కలెక్టర్ ప్రశాంతి


శ్రీసాయి కనకదుర్గ ఆలయంలో జిల్లా జడ్జి గంధం సునీత

రాజమహేంద్రవరం సాంస్కృతికం, ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: గోదావరి తీరంలో విజయదశమి ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం రాజమహేంద్రవరం నగరంలోని దేవీచౌక్‌లో అమ్మవారికి రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి కైలాస గౌరీ పూజ నిర్వహించారు. క్షీరాన్నం, గారెలు, బూరెలు, పులిహోర నైవేద్యం సమర్పించారు. ఉదయం నుంచి బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి భర్త ఢిల్లీరావు, కుమార్తె సిరిచందన, కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ● కోరుకొండ రోడ్డు శ్రీసాయి కనకదుర్గ ఆలయంలో జిల్లా జడ్జి గంధం సునీత ప్రత్యేక పూజలు చేశారు. ● రాజమహేంద్రవరం గోదావరిగట్టున ఉన్న శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి కుంకుమార్చన నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వెండి కవచంతో అలంకరించారు. సీతంపేట రామాలయంలో మహాలక్ష్మీ అమ్మవారికి పూజలు జరిగాయి. సరస్వతీఘాట్ వేదికపై గాయత్రీ నృత్యనికేతన్ శిష్యబృందం సంప్రదాయ నృత్య ప్రదర్శన జరిగింది. ● ఆర్యాపురం టింబర్ మర్చంట్ హాలులో కలప వర్తక సంఘం ఆధ్వర్యంలో తెప్పోత్సవ వేడుక జరిగింది. చండీదేవి అమ్మవారిని ఊరేగింపుగా కోటిలింగాలఘాట్‌కు తీసుకొచ్చి హంస వాహనంపై ఉంచి పూజలు, తెప్పోత్సవ వేడుక నిర్వహించారు.

● కొత్తపేట పెద్దవీధి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో పసుపు కుంకుమ పంపిణీ చేశారు.


టింబర్ మర్చంట్ హాలులో..


తుమ్మలావ నవదుర్గా ఆలయంలో..


ఆల్కాట్ తోటలో కరెన్సీతో అలంకరణ


ఊరేగింపుగా..


ఆల్కాట్‌తోటలో దీపోత్సవం

చెత్త సేకరణలో కొత్త సమస్యలు


పురవీధుల్లో పేరుకుపోతున్న చెత్త పోగులు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో చెత్త సేకరణ సమస్యగా మారింది. ఇంటింటా సేకరణకు సంబంధించి వాహనాలకు బ్రేక్ పడటంతో తరలింపు ఇబ్బందిగా మారింది. గత ప్రభుత్వం పన్ను విధించడం, కూటమి ప్రభుత్వం రద్దు చేయడం వల్ల నిర్వాహకులతో ఏర్పడిన అవాంతరాలు కారణంగా ఆ ప్రభావం చెత్త తరలింపుపై పడుతోంది. పన్ను భారం ప్రభుత్వం భరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం ద్వారా ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉంది. అప్పటి వరకూ పురవీధుల్లో పారిశుద్ధ్య లోపం కనబడుతోంది. ఉభయగోదావరి జిల్లాలకు ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న నగరంలో పరిస్థితి దయనీయంగా మారింది.

ఎక్కడికక్కడ చెత్త పోగులు

నగరంలోని కంబాలచెరువు, దేవీచౌక్, కోటగుమ్మం, మెయిన్ రోడ్డు, డీలక్స్ సెంటర్, తాడితోట, వీఎల్‌పురం తదితర ప్రాంతాల్లో వ్యాపార దుకాణాలు ఉన్నాయి. చెత్త తరలింపు పూర్తిస్థాయిలో లేకపోవడంతో దుకాణాల్లో చెత్తను రోడ్డుపైనే వేసేస్తున్నారు. అది నిల్వ పెరిగిపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నగరంలో 96,760 గృహాలు ఉన్నాయి. ప్రతీ రోజు 160 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో 40 మెట్రిక్ టన్నులు పొడి చెత్త (ప్లాస్టిక్ వ్యర్థాలు) ఉంటున్నాయి. మొత్తం 90 వాహనాలు ఉండగా ప్రతి నెలా పన్ను రూపంలో రూ.40 లక్షలు వసూలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పన్ను వసూలు నిలిపివేయాలని నిర్ణయించారు. పన్ను భారం కూడా ప్రభుత్వమే భరించే విధంగా నిర్ణయించారు. ఈ లోపు వాహనాలు నిలిచిపోయాయి.

పుష్కర్‌ఘాట్‌లో అన్నదానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: స్వర్ణాంధ్రా సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మొబైల్ అన్నదాన కార్యక్రమం ఐదో వసంతంలోకి చేరుకున్న సందర్భంగా విజయదశమి పర్వదినం రోజున వేడుక నిర్వహించారు. పుష్కరఘాట్ వద్ద జరిగిన కార్యక్రమంలో రోటరీ రివర్ సిటీ క్లబ్ అధ్యక్షుడు నాళం నరసింహారావు ముఖ్యఅతిథిగా హాజరై అవసరార్థులకు భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలు, నిరాశ్రయులకు ఆహారం అందించడం గర్వకారణమని ప్రశంసించారు.

వాలంటీర్ల సేవలకు అభినందన

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీచౌక్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు అందించిన సేవలను ఉత్సవ కమిటీ అభినందించారు. ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డిని సత్కరించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ఎస్.నాగేశ్వరరావు, పోలుకొండ సాయి, కె.మహేశ్వరి, బి.రమాదేవి పాల్గొన్నారు.

ఆహ్లాదం కరవు

టి.నగర్, న్యూస్‌టుడే: స్థానిక మున్సిపల్ కాలనీలో పార్కుల నిర్వహణ సక్రమంగా లేదు. ప్రధాన పార్కుల నిర్వహణ గాలికి వదిలేయడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విస్తరణకు గతంలో నిధులు కేటాయించినప్పటికీ పూర్తి స్థాయిలో పనులు చేపట్టలేదు. సుమారు 5 ఎకరాల్లో విస్తరించిన ఈ పార్కులో సౌకర్యాలు మెరుగుపర్చాల్సిన ఆవశ్యకత ఉంది. దీన్ని క్రీడా మైదానంగా తీర్చిదిద్దాలని గతంలోనే ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం వాకింగ్ నిమిత్తం ట్రాక్ నిర్మాణం జరిగింది. ఆ తర్వాత పచ్చదనం ఏర్పాటు చేయలేదు. మినీ స్టేడియంగా నిర్మాణం చేపడతామని హామీలు ఇచ్చినప్పటికీ ప్రతిపాదనలు గాలికి వదిలేశారు. దీంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఆట వస్తువులు శిథిలావస్థకు చేరాయి. రక్షణ గోడ పాడైపోతోంది. అధికార యంత్రాంగం స్పందించాల్సి ఉంది.


విస్తరించాల్సిన ప్రధాన పార్కు

ఆరోగ్య బాట.. పోషకాహార మాట

న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

ఆధునిక జీవన విధానంలో ఏదోఒక అనారోగ్య సమస్య ప్రతివారినీ వెంటాడుతోంది. 30 దాటితే గుండెకు ముప్పు.. 40 దాటితే నడకలో మార్పు కనబడుతోంది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో మైదానాలకు వెళ్లేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీంతోపాటు సంప్రదాయ ఆహారాలైన రాగి జావ, మొలకెత్తిన గింజలు, జొన్నలతో చేసిన పదార్థాలను తీసుకునే వారి సంఖ్య నగరంలో రోజురోజుకూ పెరుగుతోంది.

ఉరుకులు పరుగులు జీవితంలో ఉదయాన్నే నిద్రలేచి రాత్రి నానబెట్టిన మినపప్పును రుబ్బి, పచ్చడి చేసి పిల్లలకు వండి వార్చే రోజులు పోయాయి. అల్పాహారం తినాలంటే అప్పటికప్పుడు రుబ్బిన పిండి, పచ్చడి బయట నుంచి తెచ్చుకుని వేడివేడిగా తినే రోజులు. ఇదే క్రమంలో వ్యాయామం చేసిన తర్వాత ఒక గ్లాసు ధనియాల పొడి కలిపిన రాగిజావ, ఒక గుడ్డు, పచ్చి కాయగూరల ముక్కలు తినే రోజులు వచ్చేశాయి. ప్రస్తుతం ఈ దుకాణాలు ఉదయాన్నే నగరంలోని పలు క్రీడా మైదానాల వద్ద వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి.


రాగిజావ కేంద్రం వద్ద వాకర్లు

రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, ఎస్‌కేవీటీ, కంబాలచెరువు పార్కు, నాగులచెరువు స్టేడియంతోపాటు ఇన్నీసుపేట, జాంపేట, ఐఎల్‌టీడీ జంక్షన్ వంటి పలు ముఖ్య కూడళ్లలో చిన్న చిన్న స్టాల్స్ వేసి విక్రయిస్తున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఈ దుకాణాలు తెరచి ఉంటున్నాయి. రాగి జావ రూ.10కి, సలాడ్‌లు రూ.20 నుంచి రూ.25 వరకు వీటిల్లో విక్రయిస్తున్నారు.

కాయగూరల రసాలు సైతం

ఈ కేంద్రాల వద్ద కేవలం రాగిజావ మాత్రమే కాకుండా, మిక్స్‌డ్ విజిటెబుల్స్ సలాడ్, మొలకెత్తిన గింజలు, డ్రై ఫ్రూట్స్ సలాడ్, స్వీట్‌కార్న్, బొప్పాయి, జామ, ద్రాక్ష, కమలపండు కలిపిన ఫ్రూట్ సలాడ్ వంటివి విక్రయిస్తున్నారు. మరి కొన్ని ప్రదేశాల్లో పచ్చి కాయగూరల రసాలు అందుబాటులోకి తెస్తున్నారు. ఒకప్పుడు ఉదయాన్నే రాగిజావ, గుడ్డు తినేందుకు 60 నుంచి 70 మంది వచ్చేవారని.. ప్రస్తుతం 300 మంది వరకు రోజూ వస్తున్నారని ఆర్ట్స్ కళాశాల దుకాణ యజమాని ఒకరు తెలిపారు.

35 ప్లస్ వయసు వారి ఆరోగ్యం కోసం..

మోకాలు నొప్పులకు రాత్రి నానబెట్టిన బెండకాయ జ్యూస్, శరీరానికి తక్షణమే చల్లబరిచే బూడిద గుమ్మడికాయ జ్యూస్, క్యారెట్, బీట్‌రూట్, కలబందలతో చేసిన జ్యూస్‌లు తయారు చేసి విక్రయించే కేంద్రాలు నగరంలోని కొన్ని ప్రదేశాల్లో నడుస్తున్నాయి. 35 ఏళ్లు పైబడిన వారి నుంచి వృద్ధుల వరకు వీటిని తరచూ తీసుకుంటున్నారు. వీటి ధర రూ.30 నుంచి రూ.40 వరకు ఉంటోంది.

వివాహిత అదృశ్యం

రాజమహేంద్రవరం నేరవార్తలు: కాతేరు ప్రాంతానికి చెందిన ఓ వివాహిత(30) ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె భర్త మూడో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

లాలాచెరువు ప్రాంతానికి చెందిన ఎన్.ఉమామహేష్ లాలాచెరువు సర్వీసు రోడ్డులో అక్రమ మద్యం తరలిస్తుండగా ప్రకాశంనగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద ఉన్న 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఆటోనగర్ ప్రాంతానికి చెందిన ఎం.రామచంద్ర ఈ నెల 11వ తేదీ రాత్రి తన ద్విచక్ర వాహనంపై ఆటోనగర్ కూడలి దాటుతున్న తరుణంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడి తలకు గాయం కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ● దివాన్‌చెరువు గ్రామానికి చెందిన ఎన్‌వి.రత్నం శనివారం రాత్రి స్థానికంగా జాతీయ రహదారిని దాటుతున్న తరుణంలో ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

నేడు ప్రజా పరిష్కార వేదిక

టి.నగర్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పరిష్కార వేదికను నిర్వహించనున్నారు. కమిషనర్ కేతన్ గర్గ్ పాల్గొని సమస్యలపై వినతులు స్వీకరిస్తారు.

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

సాయి దివ్య నామం

బిక్కవోలు: శ్రీ సాయిబాబా సమాధిలోకి వెళ్లిన రోజును పురస్కరించుకుని ఆంధ్రా శిర్డీగా పేరుగాంచిన బలభద్రపురం శ్రీ సాయి మందిరంలో శని వారం పుణ్యతిథి కార్యక్రమాన్ని భక్తులు నిర్వహిం చారు. సాయిరామ్ పేరున దీపాలు పేర్చి పూజా కార్యక్రమం నిర్వహించారు. బాబావారి సచ్చరిత్ర పారాయణం చేశారు. భక్తులు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.


సాయిరామ్ పేరున వెలిగించిన దీపాలు

వీరంపాలెంలో ఎమ్మెల్యేకు తులాభారాలు

రంగంపేట: రామకృష్ణారెడ్డి ఎమ్మె ల్యేగా విజయం సాధించడంతో స్థానిక నాయకుడు మాచవరపు నారాయణరావు, సత్యవతి దంపతులు వారి మొక్కుప్ర కారం తులాభారం నిర్వహించారు. మండల తెదేపా అధ్యక్షుడు ఎలుబండి సత్తిబాబు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్య క్షుడు పోతుల వెంకటబ్రాజు, కూటమి నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే సంగుల దుర్గాప్రసాద్ అనే అభిమాని మొక్కు మేరకు ఇదే ఆలయంలో 108 కొబ్బరి కాయలను కొట్టి ఎమ్మెల్యే దంపతులు మొక్కు చెల్లించారు.

మెట్టలో చోరీలపై నిఘా పెట్టండి

స్పందనకు వందనం

రంగంపేట: మెట్ట వ్యవసాయ బోర్ల సామగ్రి చోరీలతో అన్నదాతలు అవస్థలు పడుతుండడంతో రాత్రులు నిఘా పెట్టాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన రంగంపేటలో సీఐ సుమంత్, ఎస్సై తోట కృష్ణసాయిలతో మాట్లాడుతూ.. వ్యవసాయ బోర్ల క్లాంపు, కాపర్ వైరు, ట్రాన్స్‌ఫార్మర్ల వైరు చోరీలతో రైతులు తలనొప్పిగా మారిందని ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఈ చోరీలపై 'ఈనాడు'లో అక్టోబరు 10న 'రైతుకు కష్టం...తీరని నష్టం' శీర్షిక కథనం ప్రచురితమవ్వడంతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పైవిధంగా స్పందించారు.

మహిళా సాధికారత కమిటీల ఏర్పాటు

రాజానగరం, న్యూస్‌టుడే: మహిళలకు పెద్దపీట వేస్తూ మూడు మండ లాలకు మహిళా సాధికార కమిటీలను ఎమ్మెల్యే బత్తుల నియమించారు. మండల గౌరవ అధ్యక్షులు, మండల అధ్యక్షురాలు, మండల ఉపాధ్యక్షురాలు ఇలా మొత్తం 22 మంది మహిళలను నియమించారు. రాజానగరం నియో జకవర్గ జనసేన పార్టీ సోషల్ మీడియా విభాగం ఇన్‌ఛార్జిగా తోట అనిల్ వాసును నియమించామని ఆయన పేర్కొన్నారు.

బ్రహ్మజోస్యులకు నివాళులు

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో గౌతమి సత్యాగ్రహ ఆశ్రమ వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్ర హ్మణ్యం జయంతి వేడుకలను నిర్వహించారు. ఆశ్రమం ప్రతినిధి జి.సునీల బాబూ కుటీరంలో జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. తెదేపా నాయ కులు పెందుర్తి అచ్యుతరామారావు, జనసేన నాయకులు మట్ట వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాలోకం.. సంప్రదాయాలకు నిలువుటద్దం

రాజానగరం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థిలో నాయ కత్వ లక్షణాలు, దేశభక్తి పెంపొందించడమే లక్ష్యంగా గైట్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరం వేడుకలను ముగించుకున్నారు. సామాజిక కార్యక్రమాల్లోనూ ప్రముఖ పాత్ర పోషించేలా వారికి ఎన్‌సీసీ అధికారులు శిక్షణ ఇస్తున్నారు. ఈ విద్యా ర్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడా నికి ఈ శిక్షణ దోహదపడనుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు కశ్మీర్, కర్ణాటక, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా వంటి ఇతర రాష్ట్రాల (జాతీయంగా 17 ఎన్‌సీసీ డైరె క్టరేట్ల నుంచి)300 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ శిబి రానికి హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్ర మాలు, పలు పోటీల్లో వారంతా తమ ప్రతి భను చూపారు. ఎన్‌సీసీ 18 ఆంధ్ర బెటా లియన్ కాకినాడ, గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, కమాండింగ్ ఆఫీసర్ ఆంధ్ర బెటాలియన్ మేజర్ ఆసిఫ్ ఖాన్ పర్యవేక్షణలో క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమొడోర్ వి.ఎమ్.రెడ్డి క్యాంపును సందర్శించి నిర్వ హిస్తున్న తీరును అభినందించారు. కొందరు క్యాడెట్లు ఈ శిక్షణలో తమ అనుభవాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.


సాంస్కృతిక ప్రదర్శనలో ఎన్‌సీసీ క్యాడెట్లు

పలు ప్రాంతాల ఆచారాలు తెలుసుకున్నా..



ఈ క్యాంపులో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి క్యాడెట్లు రావడంతో వారి ఆచార వ్యవహా రాలు, సంప్రదాయాలు తెలుసు కోగలిగాను. పుద్దుచ్ఛేరి నుంచి వచ్చిన క్యాడెట్లు మాట్లాడుతున్న సపుడు మానవత్వ విలువల గురించి అవగాహన చేసుకున్నా. ఈ శిక్షణ నా జీవితానికి ఎంతగానో ఉపయోగపడుతుం దని భావిస్తున్నా. స్థానిక నర్సరీలు చాలా బాగున్నాయి.

- బి.నాగసూర్య, కైట్ ఉమెన్ కళాశాల, కోరంగి

ఆత్మ విశ్వాసం పెరిగింది..



ఈ శిక్షణలో పాల్గొనడం ద్వారా నాలో ఆత్మ విశ్వాసం పెరిగింది. ఇతరులతో ధైర్యంగా మాట్లాడగలుగు తున్నా. ఇతర డైరెక్టరేట్ల నుంచి వచ్చిన క్యాడెట్ల భాష గురించి తెలుసుకున్నాను. తెలుగును నేర్చుకోవడానికి వారూ ఆసక్తి చూపారు. వారి ఆహార వ్యవ హారాలు తెలుసుకోగలిగాను.

-ఎం.జనార్దన సాయి, గైట్ కళాశాల, రాజానగరం

నైపుణ్యాలను పెంచుకోగలిగాను..



ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన క్యాడెట్లతో మాట్లాడటం ద్వారా నాలో సమాచార నైపుణ్యాలు అభి వృద్ధి చెందాయి. సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ఇతర ప్రాంతాల వారి సంస్కృతి, వారి వస్త్రధారణ, ఇతర వ్యవహారాలు తెలిశాయి. పరిశ్రమల నిర్వహణ గురించి తెలుసుకున్నాం. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణం పెరిగింది. -జి.రూప్స్, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల, పెద్దాపురం

సినిమాలు

దానవాయిపేట: శ్యామల, ఊర్వశి: వేట్టయన్, రాజా: మార్టిన్, కుమారి, సూర్యప్యాలెస్, అప్సర: దేవర, శివజ్యోతి, అశోక్: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమహల్: జిగ్రా, రంభ: మా నాన్న సూపర్ హీరో, మేనక: సత్యం సుందరం, మార్టిన్,(రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, దేవర (రెండేసి ఆటలు)

నర్సరీ సంఘం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కడియం: కడియపులంకలోని శ్రీ సర్‌ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆవరణలో విస్తృత సమావేశాలకు అవకాశం కల్పించేందుకు షెడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామని సంఘ అధ్యక్షుడు మల్లు పోలరాజు తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు గిరగ నాగేశ్వరరావు దంపతులు ఆధ్వర్యంలో సంఘ ఆవరణలో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సంఘ సభ్యులు పెను మాక కొండబాబు, గాడ నాగేశ్వరరావు, గట్టు కృష్ణ, రావిపాటి రామకృష్ణ, పుల్లా పెద్ద సత్యనారాయణ, రైతులు కొత్తపల్లి సత్యనారాయణ, ఆకుల వెంకటే శ్వరరావు, చల్లా రాంబాబు, కుప్పాల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం



అనపర్తి గ్రామీణం: అనపర్తి మండలం లోని వివిధ గ్రామాల్లో విద్యుత్తు లైన్ల సామర్థ్యం పెంచుతున్న నేపథ్యంలో మంగళ, బుధవా రాల్లో సరఫరాకు అంత రాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ శ్రీధర్ వర్మ చెప్పారు. వినియోగదారులు సహక రించాలని కోరారు.

15, 17 తేదీల్లో సంపతనగరంలో..

రాజానగరం: మండలంలోని సంపతన గరం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఈ నెల 15, 17 తేదీల్లో టవర్ లైన్ కండక్టర్ మార్పు కారణంగా సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలి పారు. సంపతనగరం, కొండగుంటూరు, నామవరం, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, క. తుంగపాడు, పాత తుంగపాడు, జి.యర్రం పాలెం గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సర ఫరా ఉండదని. వినియోగదారులు సహకరిం చాలని ఆయన కోరారు.


నేతాజీనగర్‌లో అమ్మవారు


హుకుంపేట ఆలయంలో..


బంగారు హారంతో శ్రీశారదాదేవి, చిత్రంలో దాత వెంకట్రావు


మాధవరాయుడుపాలెం పూజల్లో పాల్గొన్న మంత్రి దుర్గేష్


రాజానగరం బతుకమ్మ పండగలో మహిళలు


అమ్మవారికి అభయహస్తం తొడుగుతున్న భక్తులు


సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ఎమ్మెల్యే గోరంట్ల

దశదిశలు.. దశమి వేడుకలు

విజయదశమిని పురస్క రించుకుని ఊరువాడలా అమ్మవారి గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదిపరాశక్తి పండగ నాడు ప్రత్యేక అలంకరణలో దర్శ నమిచ్చారు. డప్పువాయిద్యాలు, శకటాల్లో పూలకాల నడుమ జగన్మాత ఊరే గింపు అట్టహాసంగా జరి గింది. మహిళలు పెద్దసం ఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. శమీ పూజలను వైభవంగా నిర్వ హించారు.

కోరుకొండ: స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విజయ దశమి సందర్భంగా ఆలయ ధర్మకర్త ఎస్వీ రంగరాజభట్టర్‌స్వామి ఆధ్వర్యంలో జమ్మిస్వాములు శమీ పూజలు నిర్వహించారు.

బొమ్మూరు: నేతాజీనగర్‌లోని అమ్మవారిని సకల ఆయుధాలతో అలంకరణ చేశారు. శాటిలైట్‌సిటీ ఏ బ్లాక్‌లో సత్తెమ్మతల్లి, దుర్గమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దర్శిం చుకున్నారు. భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించారు.

కడియం: దుళ్ల గ్రామంలోని మార్కెట్ కూడలిలో కొలువైన శ్రీశారదాదేవికి స్థానిక రైతు, ప్రముఖ దాత చిట్టూరి వెంకట్రావు, సూర్యచంద్ర ప్రభావతి దంపతులు రూ.3 లక్షలు విలువగల బంగారు హారాన్ని అలంకరించారు. కడియంలోని శ్రీదేవి అమ్మ వారికి నేతి నానాజీ అందించిన లడ్డూను కందుకూరి వెంకన్న రూ.40 వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. మాధవరాయ డుపాలెంలోని దసరా వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. శ్రీపవనేశ్వర్ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శమీ పూజలు నిర్వహించారు.

గోకవరం : శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి గ్రామానికి చెందిన తుమ్మల రామకృష్ణ (చిన్నబ్బు) దంపతులు బంగారు సూత్రాలు అందించారు.

రాజానగరం: స్థానిక రామాలయం వద్ద బతుకమ్మ సంబ రాలు, దశమి పూజ ఉద్వాసన, జమ్మిపూజ, రావణసంహారం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విశ్వేశ్వరీ అమ్మవారి ఆలయంలో డా.రాంబాబు, సుబ్బలక్ష్మి దంప తుల ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణం వైభవోపేతంగా జరిగింది.

హుకుంపేట: స్థానిక పాత రామాలయం వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

బిక్కవోలు: కొంకుదురు గోపాల రామానా యుడు వీధిలోని శ్రీవిజయదుర్గ అమ్మవారికి గ్రామానికే చెందిన కె.వి.కృష్ణారెడ్డి 8 గ్రాముల బంగారంతో అభయహస్తం చేయించి విజయ దశమి రోజు అందజేశారు. అర్చకులు రమణ శర్మ, భాస్కరశర్మ మంత్రోచ్ఛరణ మధ్య అభ యహస్తాన్ని కమిటీ సభ్యులు చిన్నం శ్రీనివాస రెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డిలు తీసుకుని అమ్మవా రికి అలంకరించారు.

అనపర్తి గ్రామీణం: పొలమూరులోని దేవి సెంటర్‌లోని అమ్మవారి ఆలయం, పొలమూరు మాలవీధిలో అమ్మవారి ఆలయం, పొలమూరు కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, పీరా రామచంద్రపురంలో బాలికలు అమ్మవారి ప్రతి రూపంగా భావిస్తూ పూజలు నిర్వహించారు. ఆలయాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, మాజీ ఎమ్మెల్యే సూర్య నారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు వేరువేరుగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనపర్తి వీరుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద, పాతవూ రులోని తెదేపా నాయకురాలు శేషరత్నం నివాసం వద్ద శుక్రవారం రాత్రి పడిపూజ ఘనంగా నిర్వహించారు.

అక్రమ బాణసంచా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బాణసంచాతో పోలీసులు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధి రాజవోలు గ్రామంలోని పాతఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన రూ.85 వేల విలువగల బాణసంచాను ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ గణేష్ వివ రాల ప్రకారం బాణసంచా అక్ర మంగా నిల్వ ఉంచారన్న సమా చారంతో తనిఖీ నిర్వహించామన్నారు. సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ ఆదే శాల మేరకు బాణసంచా విక్రయించేందుకు అక్రమంగా నిల్వచేసిన గుత్తుల శ్రీనివాస్‌పై కేసునమోదు చేశామన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా తయారుచేసినా, నిల్వఉంచినా కేసులు నమోదు చేస్తామని వ్యాపారులను సీఐ హెచ్చరించారు.

నర్సరీల సందర్శనలో కలెక్టర్ దంపతులు



కడియం (ధవళేశ్వరం), న్యూస్‌టుడే: కడియం పల్ల వెంకన్న నర్సరీని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు, జిల్లా కలెక్టర్ ప్రశాంతి దంపతులు ఆదివారం సందర్శించారు. దేశ, విదేశీ జాతుల మొక్కలతో కడియం నర్సరీలు ఖ్యాతి గడించాయని వారు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల ఉత్పత్తి కీలక భూమిక పోషిస్తుందన్నారు. నర్సరీ రైతులు పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల వినయ్‌లు స్వాగతం పలికి పలు మొక్కల గురించి వివరించారు. ఉద్యాన శాఖ డీడీహెచ్ దుర్గేష్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన చండీహోమం

బిక్కవోలు: దేవీ ఉత్సవాలను పురస్కరించుకుని బలభద్రపురంలో పదిరోజుల పాటు సాగిన శతచండీ యాగం శనివారం పూర్తయింది. ఉదయం అమ్మవారికి పూజలు, రాత్రికి హోమపూజలు పదిరోజుల పాటు పది మంది రుత్వికులు నిర్వహించారు. చివరి రోజు శనివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివపార్వతులకు శాంతి కల్యాణం నిర్వహించారు. కూటమి నాయకులు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, దత్తుడు సుబ్బారెడ్డి, మల్లిడి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూర్ణాహుతి దినుసులతో ప్రదక్షిణ చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

వైభవం.. బాబా పుణ్యతిథి ఉత్సవం


సాయి సేవలో ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని సాయిబాబా ఆలయాల్లో బాబా పుణ్య తిథి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండు రోజుల పాటు భక్తులతో సాయి ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. స్థానిక ద్వారకాసాయినగర్, పెట్రోలు బంకు సమీపంలోని సాయి ఆలయాలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, భాజపా కన్వీనరు నీరుకొండ వీరన్నచౌదరి, కంటే కేశవరావు, మేడిశెట్టి శివరాం తదితరులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, సహస్ర దీపాలంకరణ, భక్తులతో సామూహిక సాయి సత్యవ్రతాలు ఘనంగా జరిగాయి.

ప్రమాదం పట్టించింది

గంజాయి తరలిస్తూ చిక్కిన నిందితులు

గోకవరం: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అనూహ్యంగా రోడ్డు ప్రమాదానికి గురై పోలీసులకు దొరికిపోయారు. తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్టీఆర్ కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన బి.ప్రతాప్, కంకిపాడు మండలం మదాతువారిపాలెం చెందిన జ్యోతిప్రకాష్ ఆదివారం రంపచోడవరం నుంచి రాజమహేంద్రవరం వైపు మోటారుసైకిల్‌పై వెళుతూ గోకవరం శివారు సాయిప్రియాంక లేఅవుట్ వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. ప్రమాదంలో జ్యోతిప్రకాష్ కాలు విరిగిపోగా ప్రతాప్‌కు గాయాలయ్యాయి. బాధితులను 108 వాహన సిబ్బంది రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలంలో పడి ఉన్న వాహనం, బ్యాగులో 15 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దారకొండలో గంజాయిని కొనుగోలు చేసి విజయవాడ తరలిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ప్రమాద స్థలంలో లభ్యమైన గంజాయి బ్యాగు

బాలాలయ నిర్మాణానికి శ్రీకారం

రంగంపేట: రంగంపేట శ్రీఉమారామలింగేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణానికి రూ.2.1కోట్లు మంజూరయ్యాయి. దీనిలో భక్తుల వాటా రూ.71 లక్షల డీడీని ఇటీవల ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ద్వారా దేవాదాయ శాఖకు పంపించారు. పునః నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయి. ఈ పనులు పూర్తయ్యే వరకు బాలాలయం నిర్మించాలని గ్రామపెద్దలు భావించి ఆదివారం కమిటీ ఛైర్మన్ వుండవిల్లి జానకీరామ సుబ్బారావు (రాంబాబు), సుజాత దంపతులు శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు మైలవరపు నాగేంద్రకుమార్ వీరితో ప్రత్యేక పూజలు చేయించారు.

పల్లె పండుగ వారోత్సవాలు నేటినుంచి


శంకుస్థాపనకు సిద్ధంగా శిలాఫలకం

బొమ్మూరు, న్యూస్‌టుడే: నేటినుంచి పల్లె పండగ గ్రామ వారోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 14 నుంచి 19 వరకూ గ్రామాల్లో ఉపాధిహామీ నిధులు ఉపయోగించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రాజమహేంద్రవరం గ్రామీణంలోని 225 పనులకు గాను రూ.12.47 కోట్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే గోరంట్ల సోమవారం పిడింగొయ్యి, హుకుంపేట, శాటిలైట్‌సిటీ ఏ బ్లాక్‌లోని సీసీ డ్రైన్లు, రోడ్లు, పైపులైన్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

రాజానగరం: నియోజకవర్గంలో ఈ నెల 14 నుంచి 73 పంచాయతీలు, 84 గ్రామాల్లో రికార్డు స్థాయిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించనున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. సోమవారం ఉదయం 9గంటలకు సీతారాంపురం, కలవచర్ల, నందరాడ, నరేంద్రపురం, పాత వెలుగుబంద, తూర్పుగోనగూడెం, మధ్యాహ్నం 2 గంటల నుంచి రామస్వామిపేట, పల్లకడియం, కానవరం, పరిజెల్లిపేట, రాజానగరం, సూర్యారావుపేట, చక్రద్వారబంధం గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు.

బిక్కవోలు: కొంకుదురు, ఆరికిరేవుల, మెళ్లూరు గ్రామాల్లో రూ. 2.21 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భూమిపూజ చేయనున్నారు. ఈ నిధులు ఉపాధి, 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీల్లో పలు పనులు చేపట్టనున్నారు.

రెవెన్యూ సహాయకుడు మృతి

రంగంపేట: సింగంపల్లికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు పేరూరి జనార్దనరావు (55) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. అనారోగ్యంతో మృతి చెందిన ఈయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున తక్షణ సహాయంగా రూ.25వేలను ఇన్‌ఛార్జి తహసీల్దారు ఉండవిల్లి రంజిత్‌కుమార్ అందజేశారు. మృతుడి కుటుంబానికి మండలంలోని వీఆర్వోలు, వీఆర్ఏలు సానుభూతిని తెలిపారు.

గుర్తు తెలియని మహిళ..

కడియం: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై కడియం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. గతనెల 29న రాత్రి వేమగిరి జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వెళ్లే వాహనం గుర్తు తెలియని మహిళను బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆమె వయసు సుమారు 45 నుంచి 47 ఏళ్ల మధ్య ఉంటాయన్నారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో ఈ నెల 11న మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వాళ్లు కడియం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

తనకాలకు పౌర సన్మానం


నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే, తెదేపా ఇన్‌ఛార్జి బీవీఆర్ తదితరులు

కోరుకొండ, న్యూస్‌టుడే: ఇటీవల విశిష్ట సేవా పురస్కారం అందుకున్న తెదేపా రాష్ట్ర కార్యదర్శి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తనకాల నాగేశ్వరరావుకు ఆదివారం పౌరసన్మానం నిర్వహించారు. స్థానిక హరేరామ కల్యాణ మండపంలో కూటమి నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల, వెంకటలక్ష్మి దంపతులు, తెదేపా నియోజకవర్గం ఇన్‌ఛార్జి బీవీఆర్ చౌదరి, భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు ఏపీఆర్ చౌదరి తదితరులు తనకాలను ఘనంగా సత్కరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అయిదేళ్లుగా అభివృద్ధి లేదు: ఎమ్మెల్యే

అనపర్తి గ్రామీణం: గత అయిదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. పెడపర్తిలో సుమారు రూ.47లక్షలతో చేపట్టనున్న సీసీ రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శనివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో రూ.3.5కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా ఒక్క పెడపర్తి గ్రామంలోనే రూ.47లక్షలతో సీసీ రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. కూటమి నాయకులు తమలంపూడి సుధాకర్‌రెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కర్రి బుల్లిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గొర్రిపాటి సేవలు ఆదర్శం

బిక్కవోలు: వెలమనాయకుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు జయంతిని శ్రీ బ్రహ్మనాయుడు వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పందలపాక వెలమ సంక్షేమసంఘం సామాజిక భవనంలో జరిగిన కార్యక్రమానికి పలువురు వెలమ ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం కన్వీనర్ తెంటు సత్యనారాయణ మాట్లాడుతూ.. నేటి యువత గొర్రిపాటి బుచ్చి అప్పారావు సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంఘ అధ్యక్షులు కర్రి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గేదెల వీరబాబుతో పాటు పలువురు వెలమ నాయకులు పాల్గొన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

రాములోరి నుంచి అమ్మవారికి సారె..

రంగంపేట: కోటపాడులోని శ్రీదుర్గాదేవి అమ్మవారికి పుట్టింటి నుంచి దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీరాముల వారు ఏటా మాదిరిగానే సారె పంపించారు. శ్రీరాముల వారి ఆడపడుచుగా శ్రీదుర్గాదేవిని కోటపాడు భక్తులు కొలుస్తూ దసరా మహోత్సవాల చివరి రోజున అమ్మవారికి సారెను అందించడం ఆనవాయితీ. అక్కడకు చేర్చిన పండ్లు, పువ్వులు, పసుపు, కుంకుమ, 80రకాల పిండి వంటలకు పూజలు చేసి ఊరేగింపుగా శ్రీసత్య సాయి మందిరంలో శ్రీరాజరాజేశ్వరి అవతారంలో ఉన్న అమ్మవారి ఎదుటకు చేర్చారు. భక్తులకు పంపిణీ చేసినట్లు శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధులు కందర్ప రాంబాబు, అమర్నాథ్ తెలిపారు.

నూతన సంఘం ఎన్నిక

కోరుకొండ: కోరుకొండ మండలం నూతన రజక సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని బూరుగుపూడి పాశాలమ్మ ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర నాయకుడు మాతా సీతారాముడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షునిగా పెనుగొండ రాంబాబు, ఉపాధ్యక్షుడిగా అవనాతల్లి సింగరయ్య, ప్రధాన కార్యదర్శిగా శివశంకర్, మహిళా నాయకురాలిగా కట్టుంగ వీర వెంకాయమ్మ ఎన్నికయ్యారు. రావులపూడి సుబ్రహ్మణ్యం, బుడమపర్తి సత్యనారాయణ, పెనుగొండ వెంకటరత్నం, పట్నాల శ్రీరామచంద్రమూర్తి పాల్గొని రజక చెరువుల సమస్యలు చర్చించారు. వీటిని ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించారు.

నల్లబజారుకు పేదల బియ్యం

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతినెలా పేదలకు ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. క్షేత్రస్థాయిలో నిఘా కొరవడటంతో రేషన్ బియ్యం యథేచ్ఛగా నల్లబజారుకు తరలిపోతున్నాయి. స్వయంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పలు మిల్లుల్లో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు గుర్తించి చర్యలకు ఆదేశించినా అక్రమ రవాణా మాత్రం ఆగడంలేదు. రాజమహేంద్రవరం డివిజన్‌లోని పలు మండలాల్లో శుక్రవారం కూడా దళారులు రేషన్ బియ్యాన్ని ద్విచక్రవాహనాలపై తరలించారు. ప్రస్తుత నెలకు సంబంధించి ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరకులు పంపిణీ జరుగుతోంది. అర్బన్ మండలంలో 8,426 కార్డులు, గ్రామీణ మండలంలో 51,085 కార్డులు ఉన్నాయి. డివిజన్ మొత్తంలో ప్రతినెలా సుమారు 4,500 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండగా వీటిలో అధిక శాతం ఈ రెండు మండలాల్లోనే పంపిణీ జరుగుతున్నందున దళారులు ఎక్కువ మంది ఇక్కడే వాలిపోతున్నారు.

రాజమహేంద్రవరం డివిజన్‌లో ఇలా...

మండలాలు	- 10
చౌక దుకాణాలు	- 489
ఎండీయూ వాహనాలు	- 224
రేషన్ కార్డులు	- 3,43,397
ప్రతినెలా బియ్యం పంపిణీ	- 4,500 టన్నులు

సీఎస్ డీటీలు ఏం చేస్తున్నట్టు?

విజిలెన్సు అధికారుల తనిఖీల్లో పట్టుబడితే తప్ప పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు వ్యవహారాలు బయటకు రావడంలేదు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన మండల సరఫరా అధికారులు 'మామూలుగానే' చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. డివిజన్‌లో అయిదుగురు సీఎస్ డీటీలు ఉండగా రెండేసి మండలాలకు ఒకరికి పర్యవేక్షణ అప్పగించారు. అయినా చర్యలు శూన్యం. ఇకనైనా క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థ పటిష్టం, విస్తృత తనిఖీలకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై డీఎస్‌వో ప్రసాద్‌తో మాట్లాడగా.. క్షేత్రస్థాయిలో రేషన్ సరకుల పంపిణీ తీరును పర్యవేక్షించేలా మండల సప్లయి అధికారులకు ఆదేశాలు ఇస్తామన్నారు. అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేస్తామన్నారు.

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం



మంగతాయారు కుటుంబ సభ్యులకు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

ప్రజా సంక్షేమమే ధ్యేయం

నల్లజర్ల: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే వెంకటరాజు అన్నారు. అనంతపల్లికి చెందిన నిండ్రకొలను మంగతాయారు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. దీంతో వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు మంజూరు చేయించి ఆదివారం నల్లజర్ల తెదేపా కార్యాలయంలో ఆమె కుటుంబ సభ్యులకు సంబంధిత పత్రాన్ని ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో పసుపర్తి రతీశ్, కొల్లు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం సమిశ్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07లో చదివిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మండల విద్యాశాఖాధికారి పి.గురుమూర్తి, ఉపాధ్యాయులు ఎల్.సత్యనారాయణ, మోహనకృష్ణ తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంక, పి.ప్రదీప్, ఎం.చంద్రమౌళి, డి.ఓంకార్, ఆర్.రాజేంద్ర, వి.కిరణ్‌స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.





దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

చైత్రమాస దీక్ష

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పట్టణంలో జైన్ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చైత్రమాస దీక్షలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఆయన వెంట పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్ తదితరులు ఉన్నారు. ● జైన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలో మాజీ ఎమ్మెల్యే శేషారావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి తిరుపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

తపస్వికి ప్రశంసాపత్రం

నిడదవోలు, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని మహారాష్ట్ర గాంధీ రీసెర్చి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో నిడదవోలుకు చెందిన 7వ తరగతి విద్యార్థి కంచాల తపస్విరెడ్డి ప్రతిభా ప్రశంసాపత్రం అందుకున్నాడు. గాంధీ మూడు కోతుల సిద్ధాంతం - నేటి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం అనే అంశంపై పాల్గొని ఏపీ నుంచి ప్రశంసాపత్రం పొందిన విద్యార్థిగా తపస్వి నిలిచాడని పలువురు అభినందించారు.

కోటసత్తెమ్మకు వెండి శఠగోపం అందజేత



నిడదవోలు, న్యూస్‌టుడే: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారికి నిడదవోలుకు చెందిన చిట్యాల లక్ష్మీనరసింహారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు చిట్యాల అమర సాయితేజ 500 గ్రాముల వెండి పాదుకలు ఉన్న శఠగోపం ఆదివారం బహూకరించారు. వాటిని ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్‌కు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాయుగుండం.. రైతన్నకు గండం

● భారీ వర్ష సూచనతో అన్నదాతల్లో ఆందోళన



ఈదురుగాలులు, వర్షానికి నేలకొరిగిన వరిచేను

తాళ్లపూడి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఈ నెల 14 తేదీ నుంచి మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఖరీఫ్ సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి అధిక వర్షాలు కురిశాయి. ప్రస్తుతం ఈనిక దశకు చేరుకున్న వరి చేలు సుమారు మరో 20 రోజుల్లో చేతికి అందే అవకాశముంది. ఈ తరుణంలో గంటకు 35కి.మీ నుంచి 55 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందనే వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో పంట ఏమవుతుందోనని హాలికులు ఆవేదన చెందుతున్నారు.

కోతకు వచ్చే దశలో..

కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో 39,620 హెక్టార్లలో వరి పంట సాగవుతోంది. ఈ సాగులో 70 శాతం దీర్ఘకాలిక, మరో 30 శాతం స్వల్పకాలిక వరి వంగడాలను సాగు చేశారు. నాట్లు వేసిన ప్రారంభంలో కొవ్వాడ, ఎర్ర కాలువల ముంపు నేపథ్యంలో రెండు, మూడుసార్లు నీటమునిగాయి. చివరకు పంట చేతికి వచ్చే తరుణంలో ఎండాకు తెగులు సోకడంతో రైతులు పలు రకాల సస్యరక్షణ మందులు పిచికారీ చేశారు. ప్రస్తుతం స్వల్పకాలిక రకాలైన స్వర్ణ, సంపతి స్వర్ణ, గోల్డ్ స్వర్ణ, 1061, 1064, పీఆర్ 126, సాంబమసూరి తదితర రకాలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. వాతావరణం అనుకూలిస్తే స్వల్పకాలిక వంగడాలు మరో 15 రోజుల్లో కోతకు వచ్చే అవకాశముందని రైతులు చెబుతున్నారు. వారం రోజుల కిందట కురిసిన వర్షాలు, ఈదురుగాలుల తీవ్రతకు అక్కడక్కడా వరిచేలు నేలకొరిగాయి. ప్రస్తుతం మళ్లీ వర్షాలు పడితే ఇంతకాలం అష్టకష్టాలు పడి కాపాడుకున్న పంటను నష్టపోయే అవకాశం ఉందని రైతన్నలు ఆందోళనలో ఉన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..

వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో కోతలను నిలుపుదల చేయాలని రైతులకు సూచించాం. ఈ మూడు రోజులు పాటు వ్యవసాయశాఖ సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు సూచనలు, సలహాలు అందించాలని ఆదేశించాం. ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలియజేసాం.

- చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

ఆలయంలో కూచిపూడి నృత్యం



లాస్యసిరిని సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానికులు గద్దే కృష్ణారావు మనవరాలు జుజ్జవరపు లాస్యసిరితో కేశిరాజు శారదాదేవి నేతృత్వంలో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. కూచిపూడిలో ప్రతిభ కనబరిచి అద్భుత ప్రదర్శనలు ఇవ్వడం గొప్ప విషయమని ఆలయ కమిటీ సభ్యులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. సత్యనారాయణ, లావణ్య, వెంకటేశ్వరరావు, శ్రీను, గుడ్ల వెంకటేశ్వరరావు, కొండపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.



చిడిపిలో గండిపోశమ్మ..



ప్రత్యేకాలంకరణలో కోట సత్తెమ్మ



పాలంగిలో కనకదుర్గమ్మ



మల్లేశ్వరంలోని శ్రీమహిషాసురమర్దిని..



తాళ్లపూడి: దుర్గామల్లేశ్వరస్వామి రథం ఊరేగింపు

విజయదుర్గా.. వీడ్కోలికా



దేవరపల్లి: బాలదుర్గమ్మకి బంగారు దుద్దులు బహుకరిస్తూ..

న్యూస్‌టుడే, బృందం: శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. దీంతో ఎక్కడికక్కడ సంబరాలు అంబరాన్ని అంటాయి. జై దుర్గా.. జైజై దుర్గా అంటూ భవానీ మాలధారులు, భక్తులతో ఆలయాలన్నీ మార్మోగాయి. మిరుమిట్లు గొలిపే బాణ సంచా పేలుళ్ల, డీజే వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పల్లెలు, పట్టణాల్లో దసరా ఉత్సవాలు ముగిశాయి. అమ్మవారికి జేజేలు కొడుతూ ఊరేగింపులు, నిమజ్జన ఉత్సవాలు పలు చోట్ల జరిగాయి. ● తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో శనివారం 225 మంది దంపతులు సహస్రనామ కుంకుమపూజల్లో పాల్గొన్నారు. రూ.3,59,689ల ఆదాయం వచ్చింది. కోటసత్తెమ్మ మాల దీక్షాధారులు ఆదివారం దీక్ష విరమించారు. నిడదవోలు గ్రామదేవత నంగాలమ్మ ఆలయం వద్ద శమీ పూజతో ఉత్సవాలు ముగిశాయి. ● దేవరపల్లిలోని శ్రీ బాలదుర్గమ్మకు శనివారం ఎంపీపీ కేవీకే దుర్గారావు-వెంకటలక్ష్మీ దంపతులు రూ.51,000 విలువగల బంగారపు చెవి దుద్దులు బహూకరించారు. ఆదివారం నిమ్మలపాటి దిబ్బ ప్రాంతంలో కొలువైన విజయదుర్గాంబిక అమ్మవారి ప్రతిమను కందుల నరేష్ అనే భక్తుడు రూ.35,000 పాడుకున్నాడు. అనంతరం రూ.55 వేలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ● తాళ్లపూడిలోని నవదుర్గాదేవిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. తొమ్మిది మంది చిన్నారులను దుర్గాదేవిలుగా అలంకరించారు.

శిథిలావస్థలో తుక్కు యంత్రం



నల్లజర్లలో మండల సమాఖ్య ఆవరణలో ఉన్న తుక్కు యంత్రం మూలకు చేరింది. 2016లో తెదేపా ప్రభుత్వ హయాంలో గ్రామాలు స్వచ్ఛతగా ఉండాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుతో ఏలూరులోని డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి రూ.30 లక్షలు విలువైన తుక్కు యంత్రాన్ని నల్లజర్లకు తీసుకువచ్చారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని పంచాయితీ అధికారులు డ్రెయిన్ పూడికతీత, మట్టి రోడ్ల చదునుకు గాను దీనిని తీసుకెళ్లి గంటకు రూ.400 అద్దె మండల సమాఖ్యకు చెల్లించేవారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటి నిర్వహణను మరిచింది. దీంతో ఇవి మరమ్మతులకు గురయ్యి మూలకు చేరాయి. సంబంధిత అధికారులు ఈ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై నల్లజర్ల ఎంపీఎం శ్యాంసుందర్‌ను వివరణ కోరగా ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. **- న్యూస్‌టుడే, నల్లజర్ల**

యథేచ్ఛగా ఇసుక రవాణా



అనంతపల్లిలోని సైఫాన్ వంతెన వద్ద లారీలో ఇసుక లోడ్ చేస్తూ..

నల్లజర్ల: మండలంలోని పోతవరం, కవులూరు, పోతినీడుపాలెం, అనంతపల్లి గ్రామాల్లో ఉన్న ఎర్రకాలువ నుంచి రాత్రి సమయాల్లో ఇసుకను యథేచ్ఛగా ట్రాక్టర్లలో తరలించి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇసుక కొరత రావడం, డిమాండ్ పెరగడంతో ట్రాక్టర్ ఇసుక రూ.3,500 వరకు అమ్ముతున్నట్టు సమాచారం. ట్రాక్టర్లలో ఇసుకను ఆయా గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో చేర్చి అనంతరం లారీల్లో వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటీవల సుభద్రపాలెంలో ఎర్రకాలువ నుంచి ఇసుకను రవాణా చేసుకుని వస్తుండగా గ్రామస్థులు రెండు ట్రాక్టర్లను, ఒక బుల్‌డోజర్‌ను అడ్డుకుని సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దాంతో ఆ గ్రామంలోని ఎర్రకాలువలోకి ఎలాంటి వాహనాలు వెళ్లకుండా ఆ దారిలో శనివారం రెవెన్యూ అధికారులు గుంతలు తవ్వించారు. ఎవరైన అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగించి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నల్లజర్ల తహసీల్దార్ శాంతిప్రియ హెచ్చరించారు.

నర్సరీల సందర్శనలో కలెక్టర్ దంపతులు

కడియం(ధవళేశ్వరం), న్యూస్‌టుడే: కడియం పల్ల వెంకన్న నర్సరీని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు, జిల్లా కలెక్టర్ ప్రశాంతి దంపతులు ఆదివారం సందర్శించారు. దేశ, విదేశీ జాతుల మొక్కలతో కడియం నర్సరీలు ఖ్యాతి గడించాయని వారు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల ఉత్పత్తి కీలక భూమిక పోషిస్తుందన్నారు. నర్సరీ రైతులు పల్ల సుబ్రహ్మణ్యం, పల్లవినయ్‌లు స్వాగతం పలికి పలు మొక్కల గురించి వివరించారు. ఉద్యానశాఖ డీడీహెచ్ దుర్గేష్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధికి నాంది



ఖండవల్లిలో పెట్రోల్ బంక్ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

పెరవలి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధికి నాంది జరిగిందని మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. పెరవలి మండలం ఖండవల్లి, పిట్టలవేమవరం గ్రామాలలో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించారు. గ్రామాల్లో బంక్‌ల అవసరాన్ని గుర్తించి వీటిని సహకారం సంఘాల ద్వారా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని శేషారావు అన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మెన్ భూపతిరాజు రవివర్మ, సర్పంచులు హైమావతి, నాగరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ● పెట్రోలు బంక్ ప్రారంభ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను పిలవకపోవడం సరికాదని ఖండవల్లి-2 ఎంపీటీసీ సభ్యుడు పల్లేటి రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ కార్చర్ల సీతారామప్రసాదును, జడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనిని ఈ కార్యక్రమాలకు ఆహ్వానించక పోవడం సమంజసం కాదన్నారు.

మానవత సాయం

నల్లజర్ల, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఒకరికి మానవత సంస్థ సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం చేశారు. అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన మర్లపూడి మునీషా క్యాన్సర్ వ్యాధితో బాధపడడంతో వైద్య ఖర్చులు కోసం రూ.7,500 నగదును అందచేశారు. కార్యక్రమంలో పాతూరి సత్యనారాయణ, ఐ.డి.వి.అప్పారావు, పత్తిపాటి గంగాధరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన కాపెల్లి శ్రీనివాసుకు మానవత సంస్థ ఆదివారం చేయూతనిచ్చింది. ఇటీవల జరిగిన ప్రమాదంలో వైద్యఖర్చుల నిమిత్తం రూ.6 వేలు ఇచ్చామని సంస్థ అధ్యక్షుడు సురేష్, సభ్యులు రాజశేఖర్, హనుమంతురావు తెలిపారు.

నాలుగేళ్ల చిన్నారిపై పిచ్చికుక్క దాడి



దాడిలో చిన్నారి చేతికి గాయం

గోపాలపురం, న్యూస్‌టుడే: భవాని మాలధారణలో ఉన్న నాలుగేళ్ల చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసింది. ఈ ఘటన గోపాలపురం మండలంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుడ్డిగూడెం గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి ఇంట్లో ఉన్న సమయంలో పిచ్చికుక్క వచ్చి దాడి చేసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే స్పందించడంతో కుక్క పారిపోయింది. గాయాలైన పాపను గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి వైద్య సేవలు అందించారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది వాటిని నిర్మూలించాలని పలువురు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అధ్వానంగా రహదారి



సమస్య: దేవరపల్లి పంచాయతీ పరిధి వేంకటేశ్వరనగర్‌లోకి వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా దర్శనమిస్తోంది. మురుగు కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **- షేక్ బాజీ, స్థానికుడు**

సమాధానం: సమస్యలను పరిశీలించి తొందరిలోనే పరిష్కరిస్తాం. **- నిట్టా రవికిషోర్, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, దేవరపల్లి

నివాసాల మధ్య వ్యర్థాలు

సమస్య: దేవరపల్లి మండలం యర్నగూడెంలోని బొల్లిన విజయ్‌భాస్కర్ ఇంటి సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. వాటి నుంచి దుర్వాసన వస్తుండడంతో పరిసరాల్లోని సుమారు 10 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పంచాయతీ సిబ్బందికి ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. **- అల్లంక శివరామ్, స్థానికుడు**

సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపడతాం. **- అమ్మిరాజు, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, దేవరపల్లి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

అందని దంత వైద్యం



సీహెచ్‌సీలో నిరుపయోగంగా పరికరాలు

గోపాలపురం, న్యూస్‌టుడే: గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గత కొన్నేళ్లగా దంత వైద్యులు అందుబాటులో లేరు. ఆసుపత్రిలో దానికి సంబంధించి అన్ని పరికరాలు ఉన్నప్పటికీ వైద్యులు లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. దంత సేవలు అందించే గదిలో మరో వైద్యులు రోగులకు సేవలందిస్తున్నారు. గోపాలపురం సామాజిక కేంద్రానికి సుమారు నాలుగు మండలాలకు చెందిన రోగులు రోజూ సుమారు 250 మంది పైబడి ఓపీ వస్తుంటారు. వారిలో 20 మందికి పైనే దంత సమస్యలతో వస్తుంటారు. ఇక్కడ వైద్యులు లేక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

డిప్యూటేషన్‌పై వెళ్లి..

గతంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఓ మహిళా దంత వైద్యురాలు సేవలందించేవారు. మూడేళ్ల కిందట ఆమె డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. అప్పటి నుంచి గోపాలపురం సీహెచ్‌సీలో ఆ విభాగం వైద్యులు లేక ఖాళీగా ఉంది. వైద్య పరికరాలు ఆసుపత్రిలోని ఒక గదిలో నిరుపయోగంగా ఉన్నాయి. వైకాపా ప్రభుత్వం హయాంలో రోగులు అనేక మార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం కూటమి నేతలను సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్తాయిలో వైద్యులను నియమించాలని కోరుతున్నారు.

త్వరలో సేవలు..

డిప్యూటేషన్‌పై వెళ్లిన వైద్యులు మరలా తిరిగి వచ్చే విధంగా చర్యలు తీసుకున్నాం. డిప్యూటేషన్ రద్దు చేయించాం. త్వరలో ఆసుపత్రిలో దంత వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

- చైతన్య రాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్, గోపాలపురం